ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
గురువారం 19 సెప్టెంబరు 2024





అధినేతతో ఎమ్మెల్యేలు



మంగళగిరి సీకే కన్వెన్షన్ హాలులో బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించిన కూటమి ఎమ్మెల్యేల సమావేశంలో పాల్గొన్న గుంటూరు, పల్నాడు,బాపట్ల జిల్లా ఎమ్మెల్యేలు, మంత్రులు లోకేశ్, మనోహర్, అనగాని సత్యప్రసాద్

- పత్తికి పెరుగుతున్న గిరాకీ
- క్వింటాల్ రూ.7020కి కొనుగోలు
- కొత్త పంట వస్తే రూ.8 వేలు పలికే అవకాశం
- పొరుగు రాష్ట్రాల్లో దెబ్బ తిన్న పత్తి.. ఇక్కడి రైతులకు లాభం

తెల్ల..బంగారమే

గుంటూరు సిటీ, సెప్టెంబరు 18: తెల్ల బంగారం.. రెండేళ్లుగా రైతులను నష్టపరిచింది. అననుకూల వాతావరణం.. దిగజారిపోయిన ధరలతో సాగుదారులు నష్టాల్లో మునిగిపోయారు. పత్తి సాగు చేసే రైతుల పాలిట విపత్తుగా మారింది. ఈ క్రమంలో తప్పనిసరి పరిస్థితుల్లో ఈ ఏడు కొన్ని ప్రాంతాల్లో కొందరు రైతులు పత్తినే తిరిగి సాగు చేశారు. దిగాలుగా పత్తి సాగు చేపట్టిన రైతుల్లో తీత ప్రారంభమవుతున్న తరుణంలో ఆనందం వెల్లివెరుస్తోంది. మార్కెట్‌లో పత్తికి డిమాండ్ పెరగడంతో ధర అమాంతం పెరిగిపోయింది. దీంతో రెండేళ్లుగా నష్టాలను చవిచూసిన పత్తి రైతులు పెరుగుతోన్న ధరలపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమ ఇంట తెల్ల బంగారం సిరులు కురిపిస్తోందని సాగుదారులు సంబర పడుతున్నారు. పొలంలో ఉన్న పత్తికి గిరాకీ ఏర్పడింది. ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే ఈ ఏడాది తెల్లబంగారం ధరలు పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో పాత పత్తి క్వింటాల్ ధర రూ.7020 వరకు కొనుగోలు చేస్తున్నారు. కేంద్రం కూడా ఈ ఏడాది పత్తి క్వింటాల్‌కి రూ.7521 మద్దతు ధరగా ప్రకటించింది. సీసీఐ కేంద్రాలు తెరిచేందుకు కూడా ఏర్పాట్లు చేస్తోంది. అయితే మార్కెట్‌లో అంతకుమించి ధర ఉండటంతో ఈ ఏడాది సీసీఐ కేంద్రాలతో పెద్దగా పని ఉండకపోవచ్చని వ్యాపారులు అంటున్నారు. కొత్త పత్తి మార్కెట్‌లోకి వస్తే ప్రారంభ విలువ రూ.7500 వరకు వెచ్చించి కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. చాలాచోట్ల పంట బాగా దెబ్బతిన్నందున క్వింటాల్ రూ.8 వేలు వరకు ఆరంభంలోనే పలికే అవకాశం ఉండవచ్చని అంచనా. ప్రకాశం జిల్లాలో ఇప్పుడిప్పుడే పంట వస్తున్నట్లు తెలుస్తోంది. గుంటూరు వ్యాపారులు మార్కాపురం ప్రాంతానికి వెళ్లి కొనుగోలు చేపట్టారు. అక్కడ ముదురు పత్తి అమ్మకాలు జరుగుతున్నాయి.

అక్కడ నష్టం.. ఇక్కడ లాభం

గుజరాత్, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల్లో వర్షాలు ఎక్కువగా కురవడం వల్ల పత్తి పంట దెబ్బతినింది. ఆగస్టు, సెప్టెంబరులో కురిసిన వర్షాలకు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పత్తికి కొంత నష్టం వాటిల్లింది. ముందు వేసిన పంట గూడ రాలిపోయింది. వరద తర్వాత పంట తిప్పుకోవడంతో దిగుబడిపై ఆశలు చిగురిస్తున్నాయి. ఈ ఏడాది పల్నాడులో ఆశించిన స్థాయిలో పత్తి సాగు చేశారు. సుమారు 2,67,890 ఎకరాల్లో పంట సాగు చేసినట్లు సమాచారం. గత ఏడాది కూడా ఇక్కడ ఎక్కువ విస్తీర్ణంలో పత్తి సాగు చేశారు. అయితే ఆశించిన మేర దిగుబడి, లాభాలు రాలేదు. అయినా ఈ ఏడాది నీటి లభ్యతపై అనుమానంతో రైతులు చివరకు పత్తి వైపే మొగ్గు చూపారు. గుంటూరు జిల్లాలో సాధారణ విస్తీర్ణం కన్నా తక్కువగానే పత్తిని సాగు చేశారు. సుమారు 26 వేల హెక్టార్లలో పత్తి సాగు అవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేయగా 18 వేల హెక్టార్లకే అది పరిమితమైంది.



పల్నాడు ప్రాంతంలో పత్తి సాగు

అక్టోబరులోనే పంట చేతికి..

పల్నాడు జిల్లాలో చాలా చోట్ల పత్తి కాపు, గూడతో కళకళ లాడుతుంది. వర్షాల తాకిడి లేకపోతే సెప్టెంబరు చివరి వారంలోనే పత్తి తీయడం ఆరంభమయ్యేది. గూడ పూర్తిగా రాలిపోవడం వల్ల అక్టోబరు రెండో వారంలో పంట చేతికి వచ్చే అవకాశం ఉంది. గుంటూరు జిల్లాలో కూడా అక్టోబరు చివరకు పత్తి తీతలు ఆరంభం కానున్నాయి. పత్తి వ్యాపారానికి గుంటూరు పెట్టింది పేరు. గుంటూరు వ్యాపారులు పొరుగు జిల్లాల పంట ఎక్కువగా కొనుగోలుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. తెలంగాణలో కూడా పత్తి కొనుగోలు చేసి ఇక్కడి జిన్నింగ్ మిల్లులకు తరలిస్తారు. ప్రకాశం, కృష్ణా జిల్లాల నుంచి కూడా ఇక్కడికి పత్తి నిల్వలు వస్తాయి.

మూణ్ణాళ్లకే.. మూలకు..

- నీరుగారిపోతున్న శుద్ధజలం పంపిణీ
- కళాశాలల్లో నిరుపయోగంగా వాటర్‌ప్లాంట్లు
- రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసినా శిథిలావస్థకు..
- మరమ్మతులపై చేతులెత్తేసిన ఏజన్సీ నిర్వాహకులు



గుంటూరులోని ప్రభుత్వ బాలికల వృత్తి విద్యా జూనియర్ కళాశాలలో నిరుపయోగంగా ఉన్న వాటర్‌ప్లాంట్

గుంటూరు(విద్య), సెప్టెంబరు 18: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు శుద్ధజలం పంపిణీ మూణ్ణాళ్ల ముచ్చటగా మారింది. రూ.లక్షల వెచ్చించి ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్లు నిర్వహణా లోపం, మరమ్మతులతో మూలకు చేరాయి. దీంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఆర్భాటంగా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్లు శిథిలావస్థకు చేరాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 22 వరకు ఉండగా గత ప్రభుత్వం నాడు నేడు పథకంలో ఒక్కో కళాశాలకు రెండు చొప్పున వాటర్ ప్లాంట్లను మంజూరు చేసింది. ఒక్కో ప్లాంట్ కోసం రూ.2.50 లక్షల నుంచి రూ.3 లక్షలు వరకు వెచ్చించింది. ప్లాంట్స్‌ను కొనుగోలు చేసి వాటి ఇన్‌స్టలేషన్, నిర్వహణ, మరమ్మతుల కోసం కొన్ని ఏజన్సీలను ప్రభుత్వం ఎంపిక చేసింది. అయితే ఏజన్సీ నిర్వహకులు ఉమ్మడి జిల్లా పరిధిలోని 22 జూనియర్ కళాశాలల్లో వాటర్ ప్లాంట్లను ఇన్‌స్టాల్ చేశారు. రోజుకు సగటున 3 వేల నుంచి 5 వేల లీటర్ల సామర్థ్యంతో శుద్ధజలం విద్యార్థులకు అందేలా వీటిని ఏర్పాటు చేశారు. అయితే కొన్ని చోట్ల సాంకేతిక కారణాలతో అవి పని చేయడం లేదు. మరికొన్ని దగ్గర్ల మరమ్మతులతో మూలకు చేరాయి. దాదాపు పది కళాశాలల్లో వాటర్ ప్లాంట్లు సాంకేతిక సమస్యలతో పనిచేయడం లేదు. కొన్నిచోట్ల ఫిల్టర్స్‌ను సకాలంలో మార్చడం లేదు. దీంతో తాగడానికి అనుకూలంగా నీరు లేదని విద్యార్థులు వాపోతున్నారు. గుంటూరులోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ప్రభుత్వ వృత్తి విద్యాకళాశాలలో నాలుగు ప్లాంట్లు ఏర్పాటు చేయగా వృత్తి విద్యా కళాశాలలో ఒక ప్లాంట్ ఇప్పటికే మూలన పడింది. జూనియర్ కళాశాలలో ప్లాంట్ తరచూ మరమ్మతులకు గురవుతున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. నిర్వహణ ఏజన్సీలకు ప్రిన్సిపాల్స్ ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదు. మరమ్మతుల కోసం ఎన్నిసార్లు ఏజన్సీలను సంప్రదించినా ఇదుగో అదిగో అంటూ కాలం గడుపుతున్నారని చెబుతున్నారు. ఈ విషయాన్ని కొందరు ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది.

ఏజెన్సీలను అదుపులో పెట్టేదెవరు..

వాటర్ ప్లాంట్ల నిర్వహణ ఏజెన్సీల తీరు ఇష్టారాజ్యంగా ఉందనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వం నుంచి చేసుకున్న ఒప్పందం ప్రకారం వారు నిర్వహణ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించడం లేదు. వాటర్ ప్లాంట్‌కు చెల్లించే మొత్తంలోనే నిర్వహణకు ప్రభుత్వం నగదు చెల్లించినట్లు జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ చెబుతున్నారు. అయితే ఏజెన్సీ మాత్రం నిర్వహణ గురించి పట్టించుకోవడం లేదు. సిబ్బంది లేమి, లోపించిన సాంకేతిక నైపుణ్యం, స్పేర్‌పార్ట్స్ కొరత తదితర కారణాలతో నెలల తరబడి ప్లాంట్స్ మరమ్మతులకు నోచుకోవడం లేదు. ఫలితంగా విద్యార్థులకు శుద్ధజలం అందించాలన్న లక్ష్యం నీరుగారుతోందని ప్రిన్సిపాల్స్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ట్రాక్టర్ ఇసుక.. రూ.7 వేలు



- జిల్లాను వెంటాడుతున్న ఇసుక కొరత
- ఇంకా గాడిలో పడని ఉచిత ఇసుక
- ప్రభుత్వ ఉన్నతాశయానికి అక్రమార్కుల తూట్లు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ హయాంలో ఇసుక దోపిడీని అరికట్టి.. కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టినా ఇసుక ధర నిర్మాణ దారులకు అందుబాటులోకి రాలేదు. జిల్లా కేంద్రం నరసరావు పేటలో ట్రాక్టర్ ట్రక్కు ఇసుక రూ.7 వేలకు విక్రయిస్తున్నారు. టన్ను ఇసుక ధర రూ.1,600 వరకు ఉంది. అది కూడా సక్రమంగా సరఫరా కావడంలేదు. జిల్లా అంతటా ఇసుక కొరత నెలకొనడంతో నిర్మాణదారులు తీవ్రంగా ఇక్కట్లు పడుతున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధానం ఇంకా గాడిలో పడలేదు. కృష్ణానది వరదతో ఇసుక కొరత ఏర్పడింది. జిల్లా అంతటికీ మాదిపాడు స్టాక్ యార్డు నుంచి మాత్రమే సరఫరా చేస్తున్నారు. ఇదే అవకాశంగా అక్రమార్కులు బ్లాక్‌లో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. 20 టన్నుల ఇసుక రూ.32 వేలు వెచ్చించి నిర్మాణదారులు కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. అధికారులు నిఘా ఉంటే అధిక ధరలకు ఇసుక ఎలా విక్రయిస్తారన్న ఆరోపణలున్నాయి. ఇసుక కొరత నిర్మాణ రంగాన్ని కుదేలు చేస్తుండగా కార్మికుల ఉపాధి ప్రమాదంలో పడుతుంది. మాదిపాడు స్టాక్ యార్డులోని ఇసుక ప్లాస్టింగ్‌కు పనికిరాదని దీంతో సదరు పనులు నిలిపివేసుకుంటున్నట్లు నిర్మాణదారులు తెలిపారు.

పాలసీ మారినా తగ్గని ధరలు

వైసీపీ పాలనలో ఐదేళ్లు అధిక ధరకు ఇసుక కొనుగోలు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రవేశపెట్టిన ఉచిత విధానంతో ఆర్థిక భారం తగ్గుతుందని భవన నిర్మాణదారులు ఆశపడ్డారు. అయితే ఇప్పుడు కూడా అధిక ధర కు ఇసుక కొనుగోలు చేయాల్సి వస్తుండటంతో వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఉచిత ఇసుక సరఫరా చేయాలన్న ఉన్నతాశయానికి అక్రమార్కులు తూట్లు పొడుస్తున్నారు. యంత్రాంగం పర్యవేక్షణ కొరవడటంతో జిల్లాలో ఇసుక సరఫరా గందరగోళంగా తయారైంది. ఇసుక ధరలను నియంత్రించడంలో కూడా యంత్రాంగం విఫలమవుతోందన్న విమర్శలున్నాయి. ధరలు ఎప్పటికి అందుబాటులోకి వస్తాయన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలింది.

రవాణా చార్జీలు అధికం..

ప్రభుత్వం ప్రత్యేకంగా రవాణా చార్జీలు నిర్ణయించినా గతంలో వలే వసూలు చేస్తున్నారు. రవాణా చార్జీ అధికంగా ఉండటంతో ఉచిత విధానం అమలు కావడంలేదు. ఇసుక సరఫరా రవాణా చార్జీలను నియంత్రిస్తేనే ప్రభుత్వ లక్ష్యాలు నెరవేరతాయి. అయితే ఈ దిశగా జిల్లాలో ప్రయత్నాలు జరుగుతున్న దాఖలాలు లేవు. వైకుంఠపురం, కోనూరు, కొత్తపల్లి, వినుకొండ, కొండమోడు స్టాక్ పాయింట్లలో నిల్వలు లేవు. మాదిపాడులో కూడా ఇసుక నిల్వలు నిండుకుంటున్నాయి. నది లో డీసిల్టింగ్ పాయింట్లు ధరణికోట, దిడుగు, చామర్రు, మాదిపాడులో ఉన్నాయి. అయితే ఈ విధానంలో ఇసుక తీసేందుకు అనుమతులు రాలేదని అధికారులు చెబుతున్నారు. ఇది అమల్లోకి వస్తే కొంతమేర ధరలు తగ్గుతాయన్న అభిప్రాయం ఉంది.



లింగ నిర్ధారణకు పాల్పడితే కేసులు

స్కానింగ్ సెంటర్లకు కలెక్టర్ అరుణ్‌బాబు హెచ్చరిక

నరసరావుపేట లీగల్, సెప్టెంబరు 18: లింగ నిర్ధారణకు పాల్పడితే సదరు స్కానింగ్ సెంటర్లపై కేసు నమోదు చేస్తామని కలెక్టర్ అరుణ్‌బాబు హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో బుధవారం జరిగిన జిల్లాస్థాయి మల్టీ మెంబర్ అథారిటీ, డిస్ట్రిక్ట్ లెవెల్ అడ్వైజరీ కమిటీ సంయుక్త సమావేశంలో ఆయన మాట్లాడారు. గర్భస్థ లింగ నిర్ధారణకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఇలాంటి వారిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసు కుంటామన్నారు. స్కానింగ్ సెంటర్లలో తరచూ తనిఖీలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు లింగ నిర్ధారణ చట్టం కింద 164 ఆస్పత్రులకు అనుమతులు ఇచ్చామన్నారు. నూతనంగా 13, రెన్యువల్స్‌కు సంబంధించి పదింటికి, మార్పుల కొరకు 13 స్కానింగ్ సెంటర్లకు అనుమతులు మంజూరు చేశారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ రవితో పాటు డాక్టర్ గీతాంజలి, డాక్టర్ నాయక్, డాక్టర్ శోభారాణి, డాక్టర్ కే సాంబశివరావు, శివకుమారి, షేక్ ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్‌గ్రేస్ అక్రమాలపై కదలిక

- అపార్ట్‌మెంట్ల ప్రాంగణంలో అధికారుల తనిఖీలు
- ఆంధ్రజ్యోతి కథనాలపై స్పందన..

విచారణకు ఆదేశించిన కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబరు 18: అధికారం మాది.. అనుమతులు అవసరం లేదు.. అడిగేదెవరు.. అడ్డుకునేందుకు ఏ అధికారులు సాహసిస్తారు.. అన్నట్లుగా గుంటూరు నగర నడిబొడ్డున గ్రీన్‌గ్రేస్ పేరుతో చేపట్టిన బహుళ అంతస్తుల సముదాయంపై ఎట్టకేలకు అధికారుల్లో కదలిక వచ్చింది. గత వైసీపీ హయాంలో ఆ పార్టీ నేతలే బిల్డర్లుగా మారి చేపట్టిన



గ్రీన్‌గ్రేస్ అపార్ట్‌మెంట్లో తనిఖీలు చేపడుతున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు

బహుళ అంతస్తుల సముదాయంపై అధికారులు కన్నెత్తి చూడలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా ఏ శాఖాధికారులు కూడా పట్టించుకోలేదు. గ్రీన్‌గ్రేస్ అక్రమాలను ఇటీవల పొన్నూరు ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ బహిరంగ పరిచినా అధికారుల్లో చలనం లేదు. ఈ పరిస్థితుల్లో బుధవారం ఆంధ్రజ్యోతిలో 'అక్రమాలు.. బహుళం' అనే శీర్షిక ప్రచురితమైన కథనంతో నగర పాలక సంస్థ అధికారులు కదిలారు. తనిఖీలు చేపట్టి సమగ్ర నివేదిక అందజేయాలని అధికారులను నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. దీంతో గ్రీన్‌గ్రేస్ అపార్ట్‌మెంట్ ప్రాంగణంలో బుధవారం అధికారులు తనిఖీలు చేపట్టారు. సీపీ రాజశేఖర్, డీసీపీ మహాపాత్ర, ఏసీపీ మురళి, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ రిజ్వానా తదితరులు నిర్మాణాలను పరిశీలించారు. సంబంధిత డెవలపర్‌తో మాట్లాడి వివిధ పత్రాలను తీసుకున్నారు. లేబర్ సెస్‌కు సంబంధించి కార్మిక శాఖ ఉన్నతాధికారులు కూడా రంగంలోకి దిగనున్నట్లు తెలిసింది.

అంబటి మురళి అక్రమాలపై విచారణ జరపాలి

నగర నడిబొడ్డున మాజీ మంత్రి అంబటి రాంబాబు సోదరుడు, వైసీపీ నాయకుడైన అంబటి మురళి చేపడుతున్న గ్రీన్‌గ్రేస్ అపార్ట్‌మెంట్లపై విచారణ జరపాలని టీడీపీ కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. బుధవారం కమిషనర్ పులి శ్రీనివాసులును కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ షేక్ సజీల, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు, కార్పొరేటర్లు మాట్లాడుతూ అక్రమాలకు పాల్పడుతున్న అంబటి సోదరులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బిల్డర్ల ముసుగులో కొనుగోలు దారులను వారు మోసం చేస్తున్నారన్నారు. అనుమతులు లేకుండా అడ్డగోలుగా నిర్మాణాలు చేపట్టి, ప్లాట్లు అమ్మడం తగదన్నారు. కొనుగోలుదారుల తరపున ఆందోళన చేపడతామని, వారందరికీ తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రైల్వే, జీఎంసీ, ఫైర్, కార్మిక శాఖతో పాటు ఇతర శాఖలకు సంబంధించిన అనుమతులు లేకుండా ఏవిధంగా 15 ఫ్లోర్ల నిర్మాణం చేపడతారని ప్రశ్నించారు. జీఎంసీ అధికారులు వైసీపీ నాయకులతో కుమ్మక్కు అవడంతోనే అక్రమ నిర్మాణాలు జరిగాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కార్పొరేటర్లు వేములపల్లి శ్రీరాంప్రసాద్, కొమ్మినేని కోటేశ్వరరావు, ఎల్లావుల అశోక్‌యాదవ్, నూకవరపు బాలాజీ, ముప్పవరపు భారతి, పోతురాజు సమత, మనం పద్మశ్రీ, బొడ్డుపల్లి స్మితా పద్మజ తదితరులు పాల్గొన్నారు.

మిర్చి ధరపై గందరగోళం

- వ్యాపారుల ప్రకటనలతో రైతుల్లో అయోమయం
- మార్కెట్ పెరిగే అవకాశం ఉందని కొందరి విశ్లేషణ
- అలాంటి పరిస్థితి లేదని మరికొందరి వాదన
- రూ.18 వేల వద్ద కొనసాగుతున్న డీలక్స్ రకాలు

గుంటూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మిర్చి ధరపై వ్యాపారులు కొంతమంది పరస్పర విరుద్ధమైన సందేశాలతో రైతులను అయోమయంలో పడేస్తున్నారు. కొందరేమో ధర పెరుగుతుందని, మరికొందరు పెరగకపోవచ్చని సామాజిక మాధ్యమాల ద్వారా సందేశాలు పంపిస్తున్నారు. ఇందుకు ఎవరి విశ్లేషణలు వారు చేస్తున్నారు. దీంతో రైతులు శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసిన మిర్చిని విక్రయించాలా, మరికొన్ని రోజులు నిరీక్షించాలా అన్న విషయాన్ని తేల్చుకోలేకపోతున్నారు. నిశితంగా మార్కెట్‌ని గమనిస్తూ కొద్దికొద్దిగా మిర్చిని విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో రూ.18 వేల వరకు పెరిగిన తేజ, 341 వెరైటీ ధరలు గత వారం, పది రోజుల నుంచి స్థిరంగా కొనసాగుతున్నాయి. మరోవైపు రోజుకు 50 వేల మిర్చి టిక్కీల వరకు అమ్మకాలు జరుగుతున్నాయి. గత ఏడాది ఎగుమతులు సరిగా లేకపోవడం, పంట విస్తీర్ణం పెరిగిన కారణంగా సీజన్‌లో ఆశించినంతగా క్రయవిక్రయాలు జరగలేదు. దాంతో మేలో గుంటూరు యార్డుకు వేసవి సెలవులు ప్రకటించే నాటికి శీతల గిడ్డంగుల్లో 80 లక్షల టిక్కీల వరకు నిల్వ అయ్యాయి. జూన్ నుంచి కూడా ఎగుమతుల్లో జోరు కనిపించడం లేదు. అయితే ఈ ఏడాది వర్షాకాలంలో మిర్చి పండించే పలు రాష్ట్రాల్లో ప్రకృతి విపత్తులు సంభవించాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలోనూ భారీ వర్షాలు, వరదలు నెలకొన్నాయి. సాధారణ మిర్చి సాగు విస్తీర్ణం 47,534 హెక్టార్లు కాగా 15 రోజుల క్రితం వరకు కూడా కేవలం 1,333 హెక్టార్లలో మాత్రమే నాట్లు వేశారు. అందులో తుపానుతో 153 హెక్టార్లు దెబ్బతిన్నది. అలానే తెలంగాణలోని వరంగల్, ఖమ్మం జిల్లాల్లోనూ ప్రకృతి విపత్తులు సంభవించాయి. గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటకలోనూ ఇంచుమించు ఇలాంటి పరిస్థితే నెలకొన్నది. ప్రస్తుతం ఆయా రాష్ట్రాల నుంచి పచ్చి మిర్చి దిగుమతి అవుతూ కూరగాయల మార్కెట్‌ని ముంచెత్తుతున్నది. దీనిని పరిగణనలోకి తీసుకుంటే తర్వాత వచ్చే కోతల్లో దిగుబడి తగ్గడంతో పాటు నాణ్యత ఉండదు. ఈ పరిస్థితిపై కొంతమంది వ్యాపారులు రాబోయే రోజుల్లో మిర్చికి డిమాండ్ ఏర్పడి ధర పెరుగుతుందని అంచనా వేశారు. కాగా కొద్దిమంది మాత్రం అలాంటి పరిస్థితి ఏమి ఉండదని చెబుతున్నారు. కోల్డ్‌స్టోరేజ్‌ల్లో 49 లక్షల టిక్కీల వరకు నిల్వలు ఉన్నాయని, రాబోయే రెండు, మూడు నెలల్లో విక్రయించుకోకపోతే కొత్త పంట వచ్చి ధర తగ్గిపోయే అవకాశం ఉందంటున్నారు. ఈ వాదనని కొందరు కొట్టిపారేస్తున్నారు. ఏటా సీజన్ ప్రారంభయ్యే నాటికే కోల్డ్‌స్టోరేజ్‌ల్లో 10 లక్షల టిక్కీలు నిల్వ ఉంటాయని, దీనిని పరిగణనలోకి తీసుకుంటే రాబోయే నాలుగు నెలలకు 40 లక్షల టిక్కీలు అందుబాటులో ఉంటాయని చెబుతున్నారు. అక్టోబరులో మరోసారి ప్రకృతి విపత్తులు సంభవించే అవకాశం ఉండటంతో కచ్చితంగా ధర పెరుగుతుందని చెబుతున్నారు. ఈ విధమైన ప్రకటనలతో రైతులు అయోమయానికి గురవుతున్నారు.



ఆంధ్రజ్యోతి

నవ్య | చిత్రజ్యోతి

గురువారం • 19 సెప్టెంబరు 2024

cinema@andhrajyothy.com

హేమ కమిటీ లాంటిది అవసరం లేదు



ఐశ్వర్యా రాజేశ్

'పరిశ్రమలో ఇప్పటివరకూ నేను లైంగిక వేధింపుల బారిన పడలేదు. నాకు తెలిసినంతవరకూ తమిళ చిత్రపరిశ్రమలో అలాంటి ఘటనలు జరిగిన దాఖలాలు లేవు. కాబట్టి మాలీవుడ్‌లో ఏర్పాటు చేసిన హేమ కమిటీ లాంటిది కోలీవుడ్‌లో ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదనుకుంటున్నాను' అని దక్షిణాది నటి ఐశ్వర్యా రాజేశ్ అన్నారు. ఓ ఇంటర్వ్యూలో ఆమె పై వ్యాఖ్యలు చేశారు. ఒక వేళ నిజంగా ఎవరైనా లైంగిక వేధింపుల బారిన పడితే, దానికి కారణమైన వ్యక్తులను కఠినంగా శిక్షించాలి, మహిళల రక్షణే ముఖ్యం అని ఐశ్వర్య చెప్పారు.



మరో కథానాయిక శ్రద్ధా శ్రీనాథ్ కూడా ఇదే తరహా అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇప్పటివరకూ తాను లైంగికవేధింపుల బారిన పడలేదని ఆమె ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. "ఎనిమిదేళ్ల వయసు నుంచే జాగ్రత్తగా ఉండడం నేర్చుకున్నాను. నా చుట్టూ ఏం జరుగుతుందో గమనిస్తూ ఉండేదాన్ని. అప్రమత్తతో ఉండడం వల్లే నాకు వేధింపులు ఎదురుకాలేదు. మలయాళ చిత్రపరిశ్రమలో చాలా సినిమాలు చేశాను. అక్కడ మంచి వాతావరణమే ఉంది. పరిశ్రమలో కన్నా బయట ఎక్కువ నేరాలు జరుగుతున్నాయి. అక్కడ మహిళలకు రక్షణ కరవైందని' శ్రద్ధా శ్రీనాథ్ అన్నారు.

న్యాయం జరగాలి : అనసూయ



లైంగిక వేధింపులు ఎదుర్కొన్న మహిళలు ఎవరికీ భయపడకుండా, వెంటనే బయటపెట్టాలని నటి అనసూయ సూచించారు. జానీ మాస్టర్ చేతిలో లైంగిక వేధింపులకు గురైన మహిళా కొరియోగ్రాఫర్‌తో పలు సందర్భాల్లో కలసి పనిచేసినట్లు ఆమె సోషల్ మీడియాలో తెలిపారు. 'పుష్ప' చిత్రం సెట్స్‌లో ఆమె పనితీరు చూశాను, ప్రతిభావంతురాలు అని కితాబునిచ్చారు. ఆమెకు న్యాయం జరగాలని అనసూయ ఆకాంక్షించారు. మహిళలపైన సానుభూతి చూపడానికి పరిమితం కాకుండా వారికి అండగా నిలవాలని ఆమె ప్రజలను కోరారు.



ఎన్టీఆర్ కథానాయకుడిగా శివ కొరటాల దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'దేవర' చిత్రం ఈ నెల 27న విడుదలవుతోంది. చిత్రబృందం ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచింది. బుధవారం ఎన్టీఆర్, జాన్వీకపూర్ రొమాంటిక్ లుక్‌ను విడుదల చేసింది.

విన్నవెంటనే ఆకట్టుకునేలా...



విష్వక్ సేన్, మీనాక్షీ చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'మెకానిక్ రాకీ'. రవితేజ ముళ్లపూడి దర్శకత్వంలో రామ్ తాళ్లూరి నిర్మిస్తున్నారు. అక్టోబరు 31 విడుదలవుతున్న ఈ సినిమా నుంచి సెకండ్ సింగిల్ 'ఓ పిల్లా'ను మేకర్స్ విడుదల చేశారు. విన్న వెంటనే ఆకట్టుకునేలా ఉన్న ఈ రొమాంటిక్ సాంగ్‌కు జేక్స్ బిజోయ్ సంగీతం అందించారు. కృష్ణ చైతన్య లిరిక్స్ అందించగా.. నకాశ్ అజీజ్ ఆలపించారు.

గుర్రం పై యోధుడు



కన్నడ కథానాయకుడు ఉపేంద్ర నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'యూ ఐ ద మూవీ'. ఉపేంద్ర దర్శకత్వం వహిస్తున్న పదకొండో సినిమా ఇది. ఆయన కెరీర్‌లోనే భారీ బడ్జెట్‌తో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి కేపీ శ్రీకాంత్ నిర్మాత. నవీన్ మనోహరన్ సహ నిర్మాత. ఉపేంద్ర పుట్టినరోజు సందర్భంగా ఓ పోస్టర్ విడుదల చేశారు. గుర్రం పై యోధుడి గెటప్‌లో ఉన్న ఆయన లుక్ అదిరింది. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకున్న ఈ సినిమాను అక్టోబర్‌లో విడుదల చేయనున్నట్లు నిర్మాతలు చెప్పారు. రీష్మా నాయక్, నిధి సుబ్బయ్య, మురళీశర్మ, రవిశంకర్ ఇతర ముఖ్య తారాగణం.

ప్రశంసలు ఆనందాన్నిస్తున్నాయి



దిలీప్‌ప్రకాశ్, రెజీనా కసాండ్ర లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'ఉత్సవం'. అర్జున్ సాయి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఇటీవలే విడుదలై సక్సెస్‌ఫుల్‌గా థియేటర్లలో రన్ అవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో హీరో దిలీప్ ప్రకాశ్ మాట్లాడుతూ "ఈ సినిమాకు సూపర్‌హిట్ టాక్‌తో పాటు మంచి కలెక్షన్లు కూడా వస్తున్నాయి. ఈ రెస్పాన్స్ చూస్తుంటే చాలా సంతోషంగా ఉంది" అని అన్నారు. "నాటక రంగం నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమాను ఇంతటి హిట్ చేసినందుకు ప్రేక్షకులకు కృతజ్ఞతలు. ఈ సినిమాని చూసిన వారంతా ప్రశంసిస్తుంటే ఎంతో ఆనందంగా ఉంది" అని దర్శకుడు అర్జున్ సాయి అన్నారు.

జర్నీ... మరోసారి



శర్వానంద్, అనన్య, జై, అంజలి ప్రధాన పాత్రలు పోషించిన అనువాద చిత్రం 'జర్నీ' 2011లో విడుదలై సంచలన విజయం సాధించింది. రెండు ప్రేమ కథలను సమాంతరంగా చూపించిన తీరు ప్రేక్షకులను ఆకట్టుకొంది. ఇప్పుడు టాలీవుడ్‌లో రీ రిలీజ్ చిత్రాల ట్రెండ్ ఉంది కనుక సుప్రియ శ్రీనివాస్ ఆధ్వర్యంలో లక్ష్మి నరసింహా మూవీస్ ఈ మ్యూజికల్ లవ్‌స్టోరీని ప్రేక్షకుల ముందుకు తెస్తోంది. ఈ నెల 21న 'జర్నీ' సినిమాను రీ రిలీజ్ చేస్తున్నట్లు నిర్మాతలు తెలిపారు.

ఊహించిన దాని కంటే పెద్ద హిట్

నితేశ్‌రాణా దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'మత్తువదలరా 2'. శ్రీ సింహకోడూరి, సత్య, ఫరియా అబ్దుల్లా ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా సూపర్ హిట్ టాక్‌ను సొంతం చేసుకున్న సందర్భంగా దర్శకుడు నితేశ్‌రాణా మీడియాతో ముచ్చటించారు. "ఈ సినిమా విజయం ఇచ్చిన ఉత్సాహం ఒక వైపు. చిరంజీవి, మహేశ్‌బాబు అందించిన ప్రశంసలు మరో వైపు.. ఎంతో సంతోషాన్ని ఇస్తున్నాయి.



ఈ సినిమా మా చిత్రబృందం ఊహించిన దాని కంటే పెద్ద విజయాన్ని సొంతం చేసుకోవడంతో టీమ్ అంతా హ్యాపీగా ఉంది. ఈ సినిమాకు శ్రీ సింహకోడూరి, సత్య, ఫరియా అబ్దుల్లా హ్యూజ్ అస్సెట్‌గా నిలిచారు. కాలభైరవ ఇచ్చిన సంగీతాన్ని ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తున్నారు. ఈ సినిమాలోని పాత్రల్ని జనరంజకంగా మలిచేందుకు ఎన్నో రిఫరెన్స్‌లు తీసుకున్నాను. ఇంకో సినిమా చేయడానికి సన్నాహాలు చేసున్నాను. ఆ తర్వాతే 'మత్తు వదలరా 3' ఉంటుంది.

మంచి విజయం సాధించాలి



'పిల్ల పిలగాడు' ఫేమ్ సాయి తేజ, పావని కరణం హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'పైలం పిలగా'. ఆనంద్ గుర్రం దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాను రామకృష్ణ బొద్దుల, ఎస్.కే. శ్రీనివాస్ నిర్మించారు. ఈ నెల 20న సినిమా విడుదలవుతోంది. తాజాగా, ఈ సినిమా టీజర్, ట్రైలర్‌ను చూసి హీరో బాలకృష్ణ ప్రశంసించారు. 'ఈ సినిమా కంటెంట్ బాగుంది. సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను" అని అన్నారు.

కొత్తగా...

అద్భుతమైన విజువల్స్‌తో...



నటుడు రవిశంకర్ దర్శకుడిగా పరిచయమౌతున్న చిత్రం 'సుబ్రమణ్య'. ఆయన తనయుడు అద్వయ్ హీరోగా ఎంట్రీ ఇస్తున్నారు. అత్యున్నత సాంకేతిక విలువలతో పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతోన్న ఈ సినిమాను తిరుమల్‌రెడ్డి, అనిల్ కడియం నిర్మిస్తున్నారు. ఈ సినిమా గ్లింప్స్ ఇటీవలే విడుదలైంది. అద్భుతమైన విజువల్స్‌తో నిండిన ఈ సినిమా గ్లింప్స్ అందరినీ ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుగుతోంది. ఈ చిత్రాన్ని త్వరలోనే విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

రెట్టింపు వినోదం

యువ నటీనటులు, సాంకేతిక నిపుణులతో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ నిర్మించిన 'మ్యాడ్' చిత్రం లాస్టియర్ విడుదలై హిట్ అయింది. నార్నె నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ ఇందులో ప్రధాన పాత్రలు పోషించారు.



ఈ సినిమాకు సీక్వెల్‌గా 'మ్యాడ్ స్క్వేర్' వస్తోంది. ఇందులోని తొలి పాటను ఈ శుక్రవారం విడుదల చేస్తున్నట్లు ప్రకటించి, సంప్రదాయ దుస్తుల్లో ఉన్న మ్యాడ్ గ్యాంగ్ పోస్టర్‌ను విడుదల చేసింది 'సితార' సంస్థ. ఈ సీక్వెల్‌ను మరింత వినోదాత్మకంగా మలిచే పనిలో దర్శకుడు కల్యాణ్ శంకర్ ఉన్నారు. రెట్టింపు వినోదంతో, రెట్టింపు విజయాన్ని తమ ఖాతాలో వేసుకుంటామని నిర్మాతలు హారిక సూర్యదేవర, సాయి సౌజన్య చెప్పారు. 'మ్యాడ్' చిత్రానికి పనిచేసిన సాంకేతిక నిపుణులు ఈ చిత్రానికీ వర్క్ చేస్తున్నారు.

సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(సీటెట్) 2024



ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకునే వారికి ప్రతి సంవత్సరం సెంట్రల్ టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్(సీటెట్) నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ పరీక్ష ప్రతి ఏడాది రెండుసార్లు జరుగుతుంది. పరీక్షను సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) నిర్వహిస్తుంది. తాజాగా డిసెంబరు 2024 ఏడాదికి సంబంధించి నోటిఫికేషన్ వెలువడింది. రిజిస్ట్రేషన్ల ప్రక్రియ అక్టోబరు 16 వరకు కొనసాగనుంది. డిసెంబరు 1న పరీక్షను ఓఎంఆర్ ఆధారితంగా నిర్వహించనున్నారు.

పరీక్ష విధానం: పరీక్ష మొత్తం రెండు పేపర్లు ఉంటుంది. మొదటి పేపరు ఒకటి నుంచి అయిదు తరగతులకు బోధించాలనుకునే వారికి, రెండో పేపరు ఆరు నుంచి తొమ్మిదో తరగతులకు బోధించాలనుకునే వారి కోసం నిర్వహిస్తారు. సీటెట్ స్కోర్ జీవితకాలం వ్యాలిడిటీ కలిగి ఉంటుంది. పరీక్షను 20 భాషల్లో నిర్వహిస్తారు. దీని స్కోరు కేంద్రప్రభుత్వం పరిధిలోని పాఠశాలల ఉపాధ్యాయ నియామకాల్లో పరిగణనలోకి తీసుకుంటారు.

అర్హతలు: పన్నెండో తరగతి, డిగ్రీ, డీఈఎల్ఈడీ/ డీఈడీ(ప్రత్యేక విద్య), బీఈడీ, బీఈడీ(ప్రత్యేక విద్య), బీఈఎల్ఈడీ/ బీఎస్సీఈడీ/ బీఏఈడీ/ బీఏస్సీఈడీ ఉత్తీర్ణులై ఉండాలి.

దరఖాస్తు ఫీజు: జనరల్/ ఓబీసీ కేటగిరీలకు రూ.1000 (పేపర్-1 లేదా 2 మాత్రమే), రూ.1200(పేపర్ 1, 2 రెండూ). ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు రూ.500 (పేపర్ 1 లేదా 2 మాత్రమే), రూ.600 (పేపర్ 1, 2 రెండూ).

- **దరఖాస్తుకు చివరితేదీ:** అక్టోబరు 16
- **ఫీజు చెల్లింపునకు చివరి తేదీ:** అక్టోబరు 16
- **దరఖాస్తు సవరణ తేదీలు:** అక్టోబరు 21 నుంచి 25 వరకు
- **ఓఎంఆర్ ఆధారిత పరీక్ష:** డిసెంబరు 1
- **ఫలితాల వెల్లడి:** 2025 జనవరి
- **వెబ్‌సైట్:** https//ctet.nic.in/

దిక్సూచి

అడ్మిషన్స్

ఎన్ఎల్‌యూలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు

న్యూఢిల్లీలోని నేషనల్ లా యూనివర్సిటీ(ఎన్ఎల్‌యూ) ఢిల్లీ 2025-26 విద్యా సంవత్సరానికి డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు 'ఆల్ ఇండియా లా ఎంట్రెన్స్ టెస్ట్ 2025(ఏఐఎల్ఈటీ' నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హులైన అభ్యర్థులు నవంబరు 11లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

కోర్సు, సీట్లు: యూజీలో అయిదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ(ఆనర్స్) ప్రోగ్రామ్‌లో 120 సీట్లు, బీకాం ఎల్ఎల్‌బీ(ఆనర్స్) నాన్ రెసిడెన్షియల్ ప్రోగ్రామ్‌లో 60 సీట్లు ఉన్నాయి. అభ్యర్థులు సీనియర్ సెకండరీ స్కూల్ ఎగ్జామినేషన్(10+2) ఉత్తీర్ణులై ఉండాలి.

- పీజీ ప్రోగ్రామ్‌లో ఏడాది నాన్ రెసిడెన్షియల్ ఎల్ఎల్ఎం ప్రోగ్రామ్‌లో 80 సీట్లు, ఎల్ఎల్ఎం(ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ లా అండ్ మేనేజ్‌మెంట్) ప్రోగ్రామ్‌లో 25 సీట్లు ఉన్నాయి. అభ్యర్థులు ఎల్ఎల్‌బీ లేదా తత్సమానమైన లా డిగ్రీలో ఉత్తీర్ణులై ఉండాలి.
- ఎంఏ(ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ లా అండ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లో 25 సీట్లు ఉన్నాయి. సంబంధిత విభాగంలో అభ్యర్థులు బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- పీహెచ్‌డీ(లా, సోషల్ సైన్సెస్) ప్రోగ్రామ్‌కు 31 సీట్లు కేటాయించారు. అభ్యర్థులు ఎల్ఎల్ఎం/ మాస్టర్స్ డిగ్రీ లేదా తత్సమానమైన డిగ్రీలో ఉత్తీర్ణత సాధించాలి.

ఎంపిక: ఆల్ ఇండియా లా ఎంట్రెన్స్ టెస్ట్ 2025 తదితరాల ఆధారంగా సీట్ల కేటాయింపు జరుగుతుంది.

దరఖాస్తు రుసుము: రూ.3500(ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.1,500)

- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేదీ:** నవంబరు 18
- **అడ్మిట్ కార్డుల జారీ:** నవంబరు 28
- **ప్రవేశపరీక్ష తేదీ:** డిసెంబరు 8
- **వెబ్‌సైట్:** https://nludelhi.ac.in/

నష్ట పరిహారం అందించి ఆదుకోవాలి

- లోకేశ్‌కు తాడేపల్లి వాసుల వినతి
- 32వ రోజు ప్రజాదర్బార్‌లో విన్నపాల వెల్లువ



దివ్యాంగుడి నుంచి వినతి పత్రం స్వీకరిస్తున్న లోకేశ్

తాడేపల్లి, సెప్టెంబరు 18: గుంటూరు జిల్లా ఉండవల్లిలోని తన నివాసంలో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ నిర్వహిస్తున్న ప్రజా దర్బార్‌కు భారీగా ప్రజలు విచ్చేసి అర్జీలు సమర్పిస్తున్నారు. తాడేపల్లి మండలం కుంచనపల్లి, ప్రాతూరు గ్రామ రైతులు మంత్రి లోకేశ్‌ను కలిసి ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కుంచనపల్లి ప్రాతూరు లంక పొలాల రైతులు, కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారికి నష్టపరిహారం అందించాలని కోరుతూ వినతి పత్రం అందించారు. ఇటీవల సంభవించిన వరదలకు 57వ డివిజన్ న్యూ రాజరాజేశ్వరి నగర్‌లో తమ ఇళ్లలోకి నీరు చేరి ఇంటిలోని వస్తువులు పాడైపోయాయని ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. వైసీపీ హయాంలో వ్యాపారాలు నష్టపోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయామని డిగ్రీ చదివిన తనకు ఉద్యోగ అవకాశం కల్పించాలని తాడేపల్లికి చెందిన ఆర్ సాయికుమారి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. సీతానగరంలో గత 30 ఏళ్లుగా తన పేరుపై రిజిష్టరు అయిన ఉన్న ఇంటి స్థలాన్ని మేడా వెంకటేశ్వరరావు, అతని సోదరులు ఆక్రమించి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విచారించి తగిన న్యాయం చేయాలని విజయవాడకు చెందిన హేమాద్రి శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని బోధనాసుపత్రుల్లో పని చేస్తున్న కాంట్రాక్టు స్టాఫ్ నర్సులను రెగ్యులరైజ్ చేయాలని గవర్నమెంట్, కాంట్రాక్ట్ సర్వీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాలతో అధికారులు ఉద్యోగాల నుంచి తొలగించారని చిత్తూరుకు చెందిన 87 మంది హోం గార్డులు విజ్ఞప్తి చేశారు. చీరాల నియోజకవర్గం రామాపురం గ్రామస్తులు లోకేశ్‌ను కలిసి వైసీపీ ప్రభుత్వ హయాంలో 230 మందిపై టీడీపీ సానుభూతిపరులనే నెపంతో అక్రమ కేసులు పెట్టి వేధించారన్నారు.

ఫోర్జరీ ధ్రువ పత్రాలపై ఫిర్యాదు

సత్తెనపల్లి, సెప్టెంబరు 18: పురపాలక సంఘ పరిధిలో తన పేరు, సర్వేయర్ సంతకాలను ఫోర్జరీ చేసి తప్పుడు ధ్రువ పత్రాలు సృష్టించిన వారిపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ షమ్మి పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పట్టణానికి చెందిన గొల్లపల్లి వెంకటరావు తనకు పట్టణంలో పలు సర్వే నంబర్లలో ఖాళీ స్థలం ఉందని, పట్టణ ప్రణాళికా విభాగం నుంచి తప్పుడు ఎండార్స్‌మెంట్ సృష్టించి కృష్ణా జిల్లా మైలవరంలో ఆ స్థలానికి రిజిస్ట్రేషన్ చేయించటంపై ఇటీవల పట్టణ సర్వేయర్ పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మళ్లీ పట్టణానికి చెందిన చల్లా శివమ్మకు సర్వే నంబరు 133-3లో ఖాళీ స్థలం ఉన్నట్టు పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు ఇచ్చినట్టు కొంతమంది తప్పుడు ఎండార్స్‌మెంట్ సృష్టించారు. ఇందులో మున్సిపల్ కమిషనర్, టౌన్ సర్వేయర్ సంతకాలు ఫోర్జరీ చేశారు. చల్లా వెంకటేశ్వర్లు అనే వ్యక్తి పేరుతో కూడా కమిషనర్, సర్వేయర్ ఇచ్చినట్టు తప్పుడు దస్తావేజులు గుర్తించారు. ఈ సమాచారం కమిషనర్ దృష్టికి వెళ్ళటంతో తమ సంతకాలు ఫోర్జరీ చేసి తప్పుడు పత్రాలు సృష్టించిన గొల్లపల్లి వెంకటరావు, చల్లా శివమ్మ, చల్లా వెంకటేశ్వర్లులను విచారించి చర్యలు తీసుకోవాలని కోరుతూ కమిషనర్ షమ్మి పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బాధితులను ఆదుకునేందుకు మేమున్నామంటూ..



చంద్రబాబు నాయుడుకు రూ.35,08,800 డీడీ అందజేస్తున్న బూర్ల రామాంజనేయులు, నియోజకవర్గ నాయకులు

ఎమ్మెల్యే బూర్ల ఆధ్వర్యంలో రూ.35 లక్షలు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 18: ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లో పర్యటించి రూ.35 లక్షల విరాళాల్ని సేకరించారు. ఈ మొత్తం విరాళాన్ని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, మాజీ మంత్రి మాకినేని పెదరత్తయ్య, ఇతర నాయకులతో కలిసి రూ.35,08,800 డీడీని సీఎం చంద్రబాబుకు అందజేశారు. నియోజకవర్గ పరిశీలకులు భీమనేని వందనాదేవి, నాయకులు గింజపల్లి శివరాం ప్రసాద్, మన్నవ పూర్ణచంద్రరావు, ఇమ్మడి లీలామల్లేశ్వరరావు, గువ్వల సునీల్ చౌదరి, గింజపల్లి వెంకటేశ్వరరావు, పంగులూరి రామకృష్ణ రామినేని శ్రీనివాసరావు, జంపని హనుమంతరావు, కార్పొరేటర్ నూకవరపు బాలాజీ, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు కల్లూరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

న్యాయవాది రూ.2.35 లక్షల విరాళం

వినుకొండ, సెప్టెంబరు 18: హైకోర్టు సీనియర్ న్యాయవాది ముత్తినేని కోటేశ్వరరావు, సునీత దంపతులు సచివాలయంలో మంత్రి నారా లోకేశ్‌ని కలిసి రూ.2.35 లక్షల చెక్కును బుధవారం అందజేశారు.



లోకేశ్‌కు చెక్కు అందజేస్తున్న ముత్తినేని కోటేశ్వరరావు దంపతులు

డీఎస్సార్ ఫ్రెండ్స్ సర్కిల్ చేయూత

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 18: వరద బాధితులకు దామచర్ల శ్రీనివాసరావు ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు అండగా నిలబడ్డారు. బుధవారం ఉండవల్లిలోని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ నివాసంలో తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ చేతుల మీదగా రూ.6,01,116 చెక్కును అందజేశారు. దామచర్ల శ్రీనివాసరావు, కొత్తపల్లి నాగేశ్వరరావు, నెల్లూరి కాశయ్య, మొవ్వా వేణుబాబు, కందే శ్రీనివాస్, సురేష్, దామచర్ల వంశీకృష్ణ, కోడెల బాలాజీ, ఆనంద కుమార్, డీఎన్‌డీఎల్ సురేష్, సుబ్బారావు పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబుకు చెక్కును అందజేస్తున్న మధుబాబు

డెర్మటాలజిస్టుల రూ.5 లక్షలు

గుంటూరు (మెడికల్) సెప్టెంబరు 18: వరద బాధితుల సహాయం కోసం ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ డెర్మటాలజీ, వెనీరియాలజీ, లెప్రాలజీ (ఐఏ డీవీఎల్) ఆంధ్రప్రదేశ్ శాఖ తరపున ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.5 లక్షల విరాళం అందించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ అత్తోట కవిత, కార్యదర్శి డాక్టర్ సౌజన్య, విజయవాడకు చెందిన డాక్టర్ అనురాధ, ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి చెక్కును అందజేశారు.



సీఎం చంద్రబాబుకు రూ. 20 లక్షల చెక్కు అందజేస్తున్న గడ్డిపాటి సుధాకర్ దంపతులు, భాష్యం విద్యా సంస్థల అధినేత భాష్యం రామకృష్ణ

బలిజేపల్లి గ్రామస్తులు రూ. 2 లక్షలు

రాజుపాలెం, సెప్టెంబరు 18: మండలంలోని బలిజేపల్లి గ్రామస్తులు తమ వంతుగా రూ.2లక్షలు బుధవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును కలిసి చెక్కును అందజేశారు.

మధుబాబు ఆధ్వర్యంలో రూ. 10 లక్షలు

దుర్గి, సెప్టెంబరు 18: టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చిరుమామిళ్ల మధుబాబు బుధవారం ఉండవల్లిలోని సీఎం చంద్రబాబు గృహానికి వెళ్లి రూ. 10 లక్షల చెక్కును అందజేశారు. లింగా బ్రహ్మయ్య, మునగాకుల రామలక్ష్మయ్య, గాలి శ్రీను, తక్కెళ్లపాటి పెద్దబ్బాయి, యాగంటి వెంకటేశ్వర్లు, నిదానంపాటి అమ్మవారి ఆలయ ఛైర్మన్ యాగంటి వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.



చంద్రబాబుకు చెక్కు అందిస్తున్న కవిత, సౌజన్య, అనూరాధ

గుంటూరు ల్యాబ్ అండ్ ఎక్స్-రే ఓనర్స్ అసోసియేషన్ వితరణ

గుంటూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వరద బాధితుల సహాయార్థం గుంటూరు ల్యాబ్ అండ్ ఎక్స్‌రే ఓనర్స్ అసోసియేషన్ ముందుకొచ్చింది. రూ. లక్ష ఆర్థిక సహాయంతో పాటు సుమారు 10 వేల మందికి ఉచిత మొబైల్ హెల్త్ క్యాంప్ ద్వారా రక్త పరీక్షలతో పాటుగా నిత్య అవసరాల పంపిణీలో కూడా పాలుపంచుకొన్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఆనం సంజీవరెడ్డి తెలిపారు. సెక్రెటరీ తాడే కోరు శ్రీహరి, నగర అధ్యక్షుడు వెంకట లక్ష్మణ్, సెక్రెటరీ బి.శ్రీనివాస్, ట్రెజరర్ ఎస్ వి రమణ, నేషనల్ ఎక్స్‌రే కృష్ణ, మహమ్మద్ మస్తాన్ పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న గుంటూరు ల్యాబ్ అండ్ ఎక్స్-రే ఓనర్స్ అసోసియేషన్ నాయకులు

రూ. 2.50 లక్షల చెక్కు అందజేత..

గుంటూరు, సెప్టెంబరు 18: నవ్యాంధ్రప్రదేశ్ ప్లాస్టిక్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు గుడివాడ జయకుమార్ నేతృత్వంలోని బృందం బుధవారం మంత్రి లోకేశ్‌ను మర్యాద పూర్వకంగా కలసి వరద బాధితుల సహాయార్థం రూ. 2.50 లక్షల చెక్కును అందజేశారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, కమిటీ సభ్యులు, బీజేపీ గుంటూరు జిల్లా అధ్యక్షులు వనమా నరేంద్ర పాల్గొన్నారు.



నారా లోకేశ్‌కు చెక్కు అందజేస్తున్న తెనాలి శ్రావణ్‌కుమార్, డీఎస్సార్ ఫ్రెండ్స్ సభ్యులు

ఆర్టీసీ రిటైర్డ్ అధికారి రూ. లక్ష సాయం

రోటరీ క్లబ్ సెంటినల్ సభ్యులు, అమ్మనాన్న ఛారిటబుల్ సభ్యులు, ఆర్టీసీ రిటైర్డ్ అధికారి గోకనకొండ శరత్‌బాబు వరద బాధితుల సహాయార్థం రూ. లక్ష సాయం చేశారు. సీఎం చంద్రబాబును కలిసి రూ. లక్ష చెక్కును అందజేశారు.

వరద బాధితులకు రూ.లక్ష విరాళం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 18 : తెనాలికి చెందిన దంపతులు రూ.లక్ష విరాళం అందించారు. సీఎం చంద్రబాబుకు బుధవారం చెక్కు అందజేశారు. ప్రొఫెసర్ ముద్దన కోటేశ్వరరావు, డాక్టర్ ముద్దన కస్తూరిబాయి, వాసిరెడ్డి శ్రీకాంత్‌లు ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.



సీఎం చంద్రబాబు నాయుడుకి రూ.2 లక్షల చెక్కును అందజేస్తున్న బలిజేపల్లి గ్రామస్తులు

లాఫింగ్ క్లబ్ సభ్యుల చేయూత

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 18: వరద బాధితులకు లాఫింగ్ క్లబ్ సభ్యులు, ఫ్రెండ్స్ వాకర్స్ సభ్యులు అండగా నిలబడ్డారు. క్లబ్ తరుపున రూ 2 లక్షల చెక్కును జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, నగరపాలక సంస్థ కమిషనర్ పి శ్రీనివాసులుకి అందజేశారు. ఫ్రెండ్స్ వాకర్స్ అధ్యక్షుడు పెద్ది శివరామ్ ప్రసాదు, సభ్యులు ధర్మా కిషోర్, సంధ్య, లక్ష్మీ, రత్నం తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్ష విరాళం



చెక్కు అందజేస్తున్న నవ్యాంధ్రప్రదేశ్ ప్లాస్టిక్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జయకుమార్, నరేంద్ర

పెదకాకాని, సెప్టెంబరు 18: ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఆఫీసర్, రోటరీ క్లబ్ సెంటినల్ సభ్యులు, అమ్మానాన్న చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు గోకనకొండ శరత్ బాబు బుధవారం ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ లక్ష చెక్కును సీఎం చంద్రబాబుకు అందజేశారు. టీడీపీ నాయకులు పిల్లి మాణిక్యారావు, జర్నలిస్ట్ కుమార్ పాల్గొన్నారు.

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 18: గుంటూరు మెడికల్ కళాశాల 1990 ఏడాదికి చెందిన వైద్య విద్యార్థులు వరద బాధితులకి చేయూతనిచ్చారు. చల్లపల్లి మండలం, అముద్రలంక గ్రామంలో నష్టపోయిన వరద బాధితులకు బుధవారం 500 కుటుంబాలకు నిత్యవసర వస్తువులు, దుప్పట్లు, టవల్స్ పంపిణీ చేశారు.



చెక్కు అందజేస్తున్న డాక్టర్ కోటేశ్వరరావు దంపతులు



సీఎం చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న శరత్‌బాబు



కలెక్టర్ నాగలక్ష్మికి చెక్కు అందజేస్తున్న లాఫింగ్ క్లబ్ సభ్యులు

ట్రాక్టర్ డ్రైవర్ దారుణ హత్య



శివరామకృష్ణ (ఫైల్ ఫొటో)

కొల్లూరు, సెప్టెంబరు 18 : నిద్రిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్‌ను ఓ యువకుడు గుదిబండతో కొట్టి హత్య చేసిన సంఘటన మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని పోతార్లంక గ్రామానికి చెందిన దంతాల శివరామకృష్ణ అలియాస్ శ్రీరామయ్య (32) పంచాయతీ కార్యాలయం వద్ద బల్లపై పడుకుని నిద్రిస్తున్నాడు. పక్కనే గ్రామానికి చెందిన విష్ణు మొలకల తరుణ్‌సాయి తన స్నేహితులతో మద్యం తాగి వారు వెళ్లిన అనంతరం నిద్రిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్‌ను గుదిబండతో కొట్టి చంపాడు. పైగా డ్రైవర్ సోదరుడు విజయ్‌కుమార్‌కు ఫోన్ చేసి మీ అన్నను హత్య చేశాను శవాన్ని తీసుకు వెళ్లాలని చెప్పడంతో డ్రైవర్ సోదరుడు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని హత్య జరిగిన విషయాన్ని ఫోన్ ద్వారా పోలీసులకు వివరించాడు. సమాచారం అందుకున్న సీఐ వీరాంజనేయులు, ఎస్ఐ ఏడుకొండలు పోతార్లంక చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. హత్యకు గల కారణాలు విచారించగా హత్యకు గురైన డ్రైవర్ తన భార్యతో యువకుడిని మాట్లాడవద్దని మందలించడంతో కక్ష పెంచుకుని ఈ దారుణానికి ఒడి గట్టాడని పోలీసులు తెలిపారు. మృతుని భార్య ఆర్నెల్ల క్రితం పొన్నూరు మండలం మామిళ్లపల్లిలోని తన పుట్టింటికి వెళ్లింది. మృతునికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని సోదరుని ఫిర్యాదు మేరకు సీఐ పర్యవేక్షణలో ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం తెనాలి వైద్యశాలకు తరలించారు.

చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలు

మంగళగిరి, సెప్టెంబరు 18: నగదు తీసుకుని చెల్లించని కారణంగా ఫిర్యాదుదారుడు నిందితుడు ఇచ్చిన చెక్కును బ్యాంక్‌లో వేయగా నగదు లేవని రావడంతో ఫిర్యాదుదారుడు నిందితునిపై మంగళగిరి కోర్టులో చెక్ బౌన్స్ కేసు దాఖలు చేశాడు. ఈ కేసులో వాదోపవాదనల అనంతరం నిందితునికి ఏడాది జైలు శిక్ష, రూ.2.50లక్షల కాంపెన్సేషన్ ఫిర్యాదుదారునికి చెల్లించాలంటూ మంగళగిరి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె.సురేష్‌బాబు బుధవారం తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి.. మంగళగిరికి చెందిన దర్శి పాండురంగ విఠల్ వద్ద స్థానికంగా ఉండే శాంబ్రావు పెదకోటయ్య రూ.2 లక్షలు కుటుంబ ఖర్చు నిమిత్తం తీసుకుని 2018లో ప్రో నోటు రాశారు. అనంతరం 2020లో రూ.5,50,000లకు చెక్కును ఫిర్యాదుదారునికి అందజేయగా అతను సదరు చెక్కును తన బ్యాంకు ఎస్‌బీఐ మంగళగిరిలో వేయగా నగదు లేవని రావడంతో న్యాయవాది ద్వారా నోటీసు ఇచ్చి కోర్టులో కేసు దాఖలు చేశారు. వాదోపవాదనల అనంతరం నిందితునిపై నేరం రుజువు కావడంతో నిందితుడికి ఏడాది జైలు శిక్ష, రూ.2.50లక్షల కాంపెన్సేషన్ ఫిర్యాదుదారుడికి చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

కర్నూలు జిల్లా ఎద్దులకు ప్రథమ స్థానం



కర్నూలు జిల్లా ఎద్దులు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 18: ప్రత్తిపాడులో జరుగుతున్న జాతీయ స్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలు పోటా పోటీగా సాగుతున్నాయి. మూడో రోజున నాలుగు పళ్ల విభాగంలో పోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. ఈ పోటీలలో కర్నూలు జిల్లా బి తాండ్రపాడుకు చెందిన ఏ. చినరత్నంకు చెందిన ఎద్దులు 5100 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. అలాగే ప్రకాశం జిల్లా కొమరోలు మండలం పాముురుపల్లి గ్రామానికి చెందిన గోపు వెంకటేశ్వరరెడ్డి ఎద్దుల జత 4759.6 అడుగుల దూరం లాగి ద్వితీయ స్థానంలో నిలిచింది. నంద్యాల జిల్లా సంజాముల మండలం, నుస్సెం గ్రామానికి చెందిన కొనుదుల హరినాథ్ రెడ్డి ఎద్దుల జత 4640.1 అడుగుల దూరం లాగి తృతీయ స్థానంలో నిలిచింది. వైఎస్సార్ కడప జిల్లా కలసపాడుకు చెందిన బౌతి వెంకటరెడ్డి ఎద్దుల జత 4608.2 అడుగుల దూరం లాగి నాలుగో స్థానంలో, పల్నాడు జిల్లా మాచవరంకు చెందిన అత్తులూరి లక్ష్మీ తిరుపతమ్మ ఎద్దుల జత 4560.7 అడుగుల దూరం లాగి ఐదో స్థానంలో, ప్రకాశం జిల్లా కారంచేడు మండలం, కౌశవరప్పాడుకు చెందిన గంటా సుబ్బయ్య ఎద్దుల జత 4492.8 అడుగుల దూరం లాగి ఆరో స్థానంలో, రాచర్ల మండలం ఆకవీడుకు చెందిన లింగసాయి నాయుడు కు చెందిన ఎద్దులు 4290.3 అడుగుల దూరం లాగి 7వ స్థానంలో, రాచర్ల మండలం అక్కపల్లెకు చెందిన బత్తుల భూపాల్ ఎద్దుల జత 4200 అడుగుల దూరం లాగి ఎనిమిదో స్థానంలో నిలిచాయి. ఈ స్థానాలు సాధించిన వారికి కమిటీ సభ్యులు బహుమతులను అందజేశారు. పోటీలను తిలకించేందుకు పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చారు.

అర్ధరాత్రి ఇసుక అక్రమ రవాణా

కొల్లూరు, సెప్టెంబరు 18 : కృష్ణానదికి వరద నీరు క్రమేపీ తగ్గుముఖం పట్టడంతో ఇసుకాసూరులు విజృంభిస్తున్నారు. అర్ధరాత్రిళ్లు అరవింద వారధికి అత్యంత సమీపంలో ఇసుక అక్రమ తవ్వకాలు చేస్తున్నారు. అరవింద వారధి వద్ద ఇసుక అక్రమ రవాణాను నిలువరించేందుకు రెవెన్యూ, పోలీసులను నిఘా ఉంచినా అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదు. కొల్లూరు మండల పరిధిలోని పెసర్లంక అరవింద వారధి, గాజుల్లంక గ్రామాల పరిధిలో ప్రతిరోజూ అర్ధరాత్రుళ్లు కృష్ణానదిలో అక్రమ రవాణా యథేచ్ఛగా జరుగుతుంది. ఆయా గ్రామాల పరిధిలో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ఏర్పాటు చేసిన నిఘా బృందాలు అక్రమ ఇసుకాసూరుల నుంచి మామూళ్లు తీసుకుని ట్రాక్టర్లను అడ్డుకోకుండా వదిలి వేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పైగా అక్రమ రవాణా చేసే కొంతమంది మరికొందరి ట్రాక్టర్లు ఇసుక రవాణా కోసం వచ్చి కృష్ణానదిలో ఇసుకను నింపుకుని వెళుతుంటే ఓర్వలేక ఆయా ట్రాక్టర్లను మామూళ్లకు అలవాటు పడిన రెవెన్యూ, పోలీసు సిబ్బందికి సమాచారం ఇచ్చి పట్టిస్తున్నారు. చేతివాటానికి అలవాటు పడిన ఆయా శాఖల సిబ్బంది సైతం ఇసుకాసూరులు చెప్పినట్లుగా వింటూ ఆ వాహనాలను స్టేషన్‌కు తరలిస్తున్నారు. అదుపులోకి తీసుకున్న వాహనాలు సైతం బడా నాయకులు సిఫారసులతో పోలీసులు విడిచి పెడుతున్నారు. కేసులు లేకుండా వాటిని వదిలి వేసేందుకు ఒక్కొక్క ట్రాక్టర్‌కు భారీగా నగదును ఆ ట్రాక్టర్ల యజమానులు ముట్టజెప్పుతున్నట్లుగా గుసగుసలు వినిపిస్తున్నాయి. ఎగువ లంక గ్రామాల ప్రజల కోసం నిర్మించిన అరవింద వారధి వద్దే ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని వీటి వల్ల వంతెనకు ప్రమాదం ఏర్పడుతుందని లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎన్నో ఏళ్ల పాటు వంతెన కోసం ప్రభుత్వాల చుట్టు ప్రదక్షిణలు చేసి సాధించుకున్న వంతెనకు ఇసుక అక్రమ తవ్వకాల వల్ల ముప్పు ఏర్పడే పరిస్థితులు తలెత్తుతున్న అధికార యంత్రాంగం మాత్రం అక్రమ ఇసుక రవాణాను కట్టడి చేయలేకపోతున్నాయి. మామూళ్ల మత్తు నుంచి వీడి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని పోలీసు, రెవెన్యూ శాఖలను లంక గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కౌలు రైతు ఆత్మహత్య

అమృతలూరు, సెప్టెంబరు 18 : మూల్పూరులో కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం తాతా సాంబశివరావు (35) అనే కౌలురైతు 10 ఎకరాలు మాగాణి భూమి సాగు చేస్తున్నాడు. గతేడాది తుఫాను కారణంగా వేసి పంట నేలపాలు కావడంతో చేతికి ఏమి రాలేదు. పంట తీవ్ర స్థాయిలో దెబ్బతినడంతో దమ్ము చేయించాడు. దీంతో ఆర్థికంగా నష్టపోవంతోపాటు, అప్పులు పాలు అయ్యాడు. ఈ ఏడాది కూడా వెద సాగు చేపట్టాడు. ఈ క్రమంలో ఇటీవల కురిసిన వర్షాలకు కొంతమేర పంట ముంపునకు గురి కావడంతోపాటు, నాటు వేసిన పొలంలో మందులు పిచికారి చేసినా కలుపు అదుపు కాలేదు. దీంతో మనస్తాపంతో మంగళవారం ఉదయం నుంచి పొలం వద్దే ఉన్నాడు. భార్య పొలంలో పని చేస్తున్న క్రమంలో మధ్యాహ్నం ఇంటికి వచ్చి ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సాంబశివరావుకు భార్య, 5ఏళ్ల బాలిక, మూడేళ్ల బాలుడు ఉన్నారు. వ్యవసాయశాఖ అధికారులు సాంబశివరావు ఇంటికి, సాగు చేస్తున్న పొలంను పరిశీలించారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసేందుకు నిరాకరించడంతో వెనుదిరిగారు. దీనిపై పోలీసులకు ఏలాంటి సమాచారం అందలేదు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.45
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	121, 129,140
చికెన్ విత్ స్కిన్	228.00
చికెన్ స్కిన్ లెస్	238.00

పల్నాడు వార్తలు



బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరిని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ బుధవారం విజయవాడలోని ఆమె నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు - సత్తెనపల్లి

ఎన్నడూ ఏ ప్రభుత్వం ఇవ్వని విధంగా సాయం

● సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, సెప్టెంబరు 18 : వరదల్లో నష్టపోయిన ప్రతి ఇంటికి ఎన్నడూ ఏ ప్రభుత్వం ఇవ్వని విధంగా సీఎం చంద్రబాబునాయుడు ఆర్థికసాయం ప్రకటించారని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొదటి అంతస్థు ఇంటిలో ఉండే వారికి రూ.10 వేలు, విజయవాడ కాకుండా ఇతర ప్రాంతాల్లోని వారికి రూ.10 వేలు ఆర్థికసాయం ప్రకటించటం హర్షణీయమన్నారు. అలాగే సోయాబీన్ పొద్దు తిరుగుడుకు రైతుకి హెక్టారుకి రూ.15 వేలు, పసుపు, అరటికి రూ.35 వేలు, కూరగాయలకు రూ.25 వేలు, మిరపకు రూ.35 వేలు, జనపనార, కొర్రలు, సామలుకు రూ.15 వేలు ఆర్థిక సాయం ప్రకటించిందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు వరద బాధితులకు అన్నివిధాలా అండగా ఉంటూ, భరోసా ఇస్తున్న తీరుని ప్రజలంతా కొనియా డుతున్నారని ఎమ్మెల్యే కన్నా తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పిడుగురాళ్ల, సెప్టెంబరు 18: కొండమోడు 220 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో అత్యవసర మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు పిడుగురాళ్లపట్టణం, జానపాడులో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శివనాగిరెడ్డి తెలిపారు.

విశ్వకర్మ విగ్రహం ఊరేగింపు

పిడుగురాళ్ల, సెప్టెంబరు 18: విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలో విశ్వకర్మ ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపు నిర్వహించారు. ఆదిగురువు విశ్వకర్మ భగవాన్ సృష్టికి మూలమని, పరమాత్మ విశ్వకర్మ ఐదు ముఖాలతో, 10 చేతులతో స్వయంభు అవతారంగా వున్న ఉత్సవ విగ్రహాన్ని పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘ పెద్దలు ఊరేగింపులో పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు

గురజాలటౌన్, సెప్టెంబరు 18: మండలంలోని చర్లగుడిపాడు గ్రామానికి చెందిన గామాలపాటి శిరీష కనిపించడం లేదంటూ గురజాల పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. శిరీష ఈనెల 16న రాత్రి ఒంటి గంట సమయంలో తన ఇద్దరు కుమారులతో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జేజేఎం పథకానికి రూ.8 కోట్లు విడుదల

● వాటర్‌గ్రిడ్ పథకానికి అనుమతులివ్వడంలో అటవీశాఖ జాప్యం
● విషయం సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళతా..
● ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

రెంటచింతల,సెప్టెంబరు 18 : రెంటచింతల మండలంలోని 11 గ్రామాల్లో రెండవ విడత జల్‌జీవన్ మిషన్ పథకం పనులు ప్రారంభించేందుకు గాను రూ.8కోట్లు విడుదలయ్యాయని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. 100 రోజుల పాలనపై సీఎం చంద్రబాబుతో నిర్వహించిన సమావేశానికి వెళ్తున్న ఎమ్మెల్యే మార్గ మధ్యంలో రెంటచింతలలో విలేకరులతో మాట్లాడారు.

పల్నాడు జిల్లాలోని 26 మండలాలకు తాగునీటిని అందించడానికి రూ.1200 కోట్లతో రూపొందించిన వాటర్‌గ్రిడ్ పథకానికి అనుమతులివ్వడంలో అటవీశాఖ జాప్యం జరుగుతుందని, ఇదే విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ఈ పథకం విజయపురిసౌత్ నుంచి ప్రారంభమవుతుందని ఇందులో రెంటచింతల మండలం పాలువాయిగేట్ వద్ద ఎత్తైన ప్రదేశంలో ఓహెచ్‌బీఆర్ (ఓవర్ హెడ్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్) నిర్మిస్తారని ప్రతి గ్రామ పౌరునికి తాగు నీరందించే నిమిత్తం ఈ మండలానికి రూ.14 కోట్లు కేటాయించారన్నారు. 2.5 లక్షల లీటర్ల సామర్థ్యం గల ఈ ట్యాంక్‌ను 24 గంటలు నీటితో నింపుతూ 11 గ్రామాల రక్షిత నీటి ట్యాంకులకు అనుసంధానం చేస్తారని ఎమ్మెల్యే తెలిపారు.



గుంటూరు జీజీహెచ్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జూలకంటి

గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో ఉత్తమ వైద్యసేవలు

- సద్వినియోగం చేసుకోండి.. ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, సెప్టెంబరు 18: గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కోరారు. గుంటూరు జనరల్ ఆసుపత్రిలో నూతనంగా నిర్మించిన క్యాన్సర్ విభాగాన్ని బుధవారం గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాముతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి, ఆరోగ్య భద్రతకు పెద్దపీట వేస్తుందన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన క్యాన్సర్ విభాగంలో అత్యాధునిక వైద్య పరికరాలతో ప్రజలకు సేవలు అందించనున్నారని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి అన్నారు.



దేవరంపాడులో గ్రామస్థులతో సబ్‌యూనిట్ అధికారి చంద్రశేఖర్, వైద్య సిబ్బంది

సీజనల్ వ్యాధులతో అప్రమత్తం

రాజుపాలెం, సెప్టెంబరు 18 : సీజనల్‌గా వచ్చే వ్యాధుల నుంచి అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి చంద్ర శేఖర్ కోరారు. బుధవారం మండలంలోని దేవరంపాడు గ్రామంలోని పరిసరాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జ్వరాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆరోగ్య పర్యవేక్షకులు ఉషారాణి, సీహెచ్‌వో లక్ష్మీదుర్గ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని తీసుకోవాలి

ముప్పాళ్ళ, సెప్టెంబరు 18: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జీ.జయలక్ష్మి సూచించారు. మండలంలోని మాదల గ్రామంలో బుధవారం పోషణ మహాయాన్, స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గర్భిణులకు వెయ్యి రోజుల సంరక్షణ గురించి వివరించారు. అలాగే వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జీ.శ్రీనివాసరావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ టీ భవానీ లత, అంగన్ వాడీ కార్యకర్తలు కే శాంతి, డీ అంజమ్మ, ఎల్ అన్నపూర్ణ, వీ అనురాధ, ఎం వీరమ్మ, డీ వీర కుమారి, డీ సుధారాణి ఉన్నారు.

భక్తులకు అన్నదానం

గురజాలటౌన్, సెప్టెంబరు 18: వినాయక చవితి సందర్భంగా పట్టణంలోని శ్రీదేవి రైస్‌మిల్ సెంటర్‌లో విఘ్నేశ్వర ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన వినాయకుని మండపం వద్ద బుధవారం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మహంకాళి నీలంరాజు, మాజీ సర్పంచ్ గడిపూడి చెన్నయ్య, కౌన్సిలర్ నేలవల్లి బుల్లయ్య, శరమాల హనుమంతరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు అడపా శ్రీనివాసరావు, శివ, నరేష్, అంజి తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు

ఒప్పిచర్ల జడ్పీ హైస్కూలు విద్యార్థిని



విద్యార్థిని శివమణి

కారంపూడి, సెప్టెంబరు 18: మండంలోని ఒప్పిచర్ల జిల్లా పరిషత్ హైస్కూల్లో 8వ తరగతి చదువుతున్న పాశం శివమణి జాతీయ స్థాయి సబ్‌జూనియర్ ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం విజయలలిత తెలిపారు. ఉమ్మడి ప్రకాశంజిల్లా జెపంగులూరులో నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిజట్టుకి శివమణి ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 28 నుంచి అక్టోబరు 2 వరకు జార్ఖండ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్రజట్టుకి శివమణి ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు. బుధవారం విద్యార్థిని శివమణిని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు చినరత్తయ్య, ఉపాధ్యాయులు, ఆషా, దుర్గాదేవి, నిర్మల, రమాదేవి, అబ్దుల్ రఫీ, అంజిరెడ్డి, హనుమంతురావు, కిరణ్‌కుమారి, సౌజన్య, సునీత, బలరాం, సీతా మహాలక్ష్మి, సంధ్యాలు అభినందించారు.

నేటి నుంచి క్రీడా పోటీలు ప్రారంభం

రెంటచింతల,సెప్టెంబరు 18: మండల కేంద్రమైన రెంటచింతలలోని సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో గురువారంనుంచి మూడు రోజులపాటు పాఠశాల స్థాయి క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు కో-ఆర్డినేటర్ కే.రవి, షేక్ సుభానిలు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాల, బాలికల విభాగాల్లో నిర్వహించే ఈ పోటీలలో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేట్ పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొంటున్నట్లు వారు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నకరికల్లు, సెప్టెంబరు 18 : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి బుధవారం మృతి చెందినట్లు ఎస్ఐ చల్లా సురేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 6న అడ్డరోడ్డు - నరసరావుపేట రోడ్డులో దేచవరం మిద్దె సమీపాన ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కండ్లకుంట వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన షేక్ బాజీ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. చికిత్స పొందుతున్న బాజీ బుధవారం మృతి చెందినట్లు ఆస్పత్రి వర్గాలు సమాచారం అందించినట్లు ఆయన తెలిపారు.

ఇద్దరు ఎంఈవోలతో

పాఠశాల విద్య మరింత బలోపేతం

రెంటచింతల,సెప్టెంబరు 18 : ఇద్దరు ఎంఈవోలతో పాఠశాల విద్య బలోపేతం అవుతుందని డిప్యూటీ ఈవో ఏసుబాబు తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎంఈవో 2 పోస్టులను ప్రభుత్వం ఎత్తివేస్తుందని వస్తున్న వార్తలు కేవలం ఊహాగానాలేనని, అందులో ఏవిధమైన వాస్తవం లేదని స్పష్టం చేశారు. పరిపాలన అకడమిక్ సౌకర్యాల నిమిత్తం ఎంఈవో 1, 2 పోస్టులను కొనసాగించడంతో పాటు స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు కొద్దిపాటి అధికారాలు అప్పగిస్తే పాఠశాల విద్యకు మరింత మేలు జరుగుతుందన్నారు.



సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

క్రోసూరు, సెప్టెంబరు 18 : రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారం చేపట్టి వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం క్రోసూరులోని ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి టీడీపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ కాంద్రు కాశయ్య, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నలజాల సదాశివరావు, మాజీ ఎంపీపీ అనుముల వెంకటరామిరెడ్డిలు ఈ సందర్భంగా మాట్లాడుతూ వంద రోజుల కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రానికి ఎన్నో ప్రయోజనాలు సమకూరాయన్నారు. అమరావతి రాజధాని నిర్మాణానికి, పోలవరం నిర్మాణానికి కేంద్ర బడ్జెట్‌లో నిధులు సాధించారన్నారు. ప్రతినెల 1న పింఛన్ల పంపిణీ, ఉద్యోగులకు జీతాలు, అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు గుడిపాడు బాషా, పార్టీ నాయకులు దుద్దుల యోహాన్, అనుమాల పూర్ణ, రామిరెడ్డి, మల్లాల రామాంజనేయులు, బండారు షైనూరు బాబు, ఊరే రోశయ్య, జుజ్జూరి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అడుగు స్వచ్ఛత వైపు

● ఐటీసీ సెర్ప్ సీవో మాడెబోయిన గురుప్రసాద్
● వివిధ ఆప్రాంతాల్లో స్వచ్ఛతాహి సేవ ర్యాలీలు, ప్రతిజ్ఞలు

రెంటచింతల, సెప్టెంబరు18: ప్రతి అడుగు స్వచ్ఛత వైపు వేసి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుదామని ఐటీసీ సెర్ప్ సీవో మాడెబోయిన గురుప్రసాద్ అన్నారు. స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రమైన రెంటచింతలలో సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మానవహారం, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం దుర్గా ప్రసాద్, రాంబాబు, శౌరయ్య, హరిత రాయబారులు పాల్గొన్నారు.

కారంపూడి: మండలంలోని చింతపల్లిలో ఈవోపీఆర్డీ సత్యప్రసాద్ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీ సేవా ర్యాలీ నిర్వహించి మురుగు కాలువల్లో పూడికతీత, చెత్తా తొలగింపు పనులను చేపట్టారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామరాజు,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అచ్చంపేట: అచ్చంపేటలో ఐటీసీ కమ్యూనిటీ ఆర్గనైజర్ సతీష్, పంచాయతీ కార్యదర్శి ఏవీ సుబ్బారావు ఆధ్వర్యంలో విద్యార్థులు స్వచ్ఛతాహి సేవా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆషా వర్కర్లు, క్లాప్ మిత్రలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

క్రోసూరు: మండల కేంద్రం క్రోసూరులో ఎంపీడీవో బిక్కి మహేష్‌బాబు ఆధ్వర్యంలో స్వచ్ఛతాహి సేవ ర్యాలీ నిర్వహించారు. అమరావతి బస్టాండ్ సెంటర్‌లో మానవహారం నిర్మించారు. ఆరోగ్య విస్తరణ అధికారి శిఖాశ్యామ్‌సన్ ఆధ్వర్యంలో ఊటుకూరులో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం జరిగింది.



అచ్చంపేటలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహిస్తున్న ఐటీసీ, పంచాయతీ అధికారులు, సిబ్బంది

ప్రకృతి వ్యవసాయంతో నిరంతర ఆదాయం

● పల్నాడు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కే అమలకుమారి
● పలు ప్రాంతాల్లో పంటల పరిశీలన



బెల్లంకొండ మండలం, నాగిరెడ్డిపాలెంలోమహిళా రైతులతో కలసి కూరగాయల పంటలు పరిశీలిస్తున్న అమల కుమారి

బెల్లంకొండ, సెప్టెంబరు18: ప్రకృతివ్యవసాయ విధానంలో ఏటీఎం మోడల్ విధానాన్ని పాటిస్తే రైతులకు నిరంతర ఆదాయం పొందవచ్చునని పల్నాడు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కే అమలకుమారి తెలిపారు. బుధవారం మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ ఏటీఎం మోడల్ విధానాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏటీఎం మోడల్‌లో మొత్తం 27 రకాల పంటలు, పూల రకాలు ఒకేపొలంలో వేయవచ్చు నని, దాని వలన రైతులు 365 రోజులు లాభం పొందవచ్చని అన్నారు. రైతు సాధికారిత సంస్థ కమ్యూనికేషన్ తిమోటిక్ లీడ్‌ప్రవీణ్ కుమార్, సినిమాటోగ్రఫీ శివరామకృష్ణ, ప్రకృతి వ్యవసాయంలో ఏగ్రేడు మోడల్‌లో సాగుచేస్తున్న రైతులను వీడియోద్వారా చిత్రీకరించారు. కార్యక్రమంలో అనంతలక్ష్మి, అంజలి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పెదకూరపాడు: ప్రకృతి వ్యవసాయ, రసాయానిక విధా నాలతో సాగు చేస్తున్న పత్తి పంటలను ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కే అమలకుమారి బుధవారం పరిశీలించారు. ప్రకృతి, రసాయానిక వ్యవసాయ పద్ధతు ల్లో సాగు చేసిన పత్తి పొలాలను తాము పరిశీలించామని, రెండు విధానాల్లో ఎంతో తేడా ఉందని ఆమె వివరించారు. కార్యక్రమంలో సాధికార సంస్థ కమ్యూనికేషన్ తిమ్మటిక్ లీడ్ ప్రవీణ్‌కుమార్, సినిమాటోగ్రఫీ శివరామకృష్ణ, వీడియో ఎడిటర్ విజయకుమార్, ప్రకృతివ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ మద్యం స్వాధీనం

● పోలీసుల అదుపులో మద్యం విక్రయిస్తున్న మహిళ

మాచవరం, సెప్టెంబరు 18: తెలంగాణా మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తున్న ఒక మహిళను అదుపులోకి తీసుకొని ఆమె వద్ద నుంచి 36 తెలంగాణా మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు. ఈ విషయంపై బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలోని శ్రీరుక్మిణీపురం గ్రామానికి చెందిన మేఘావత్ బాలీబాయి అనే మహిళ గ్రామంలో తెలంగాణా మద్యం సీసాలు విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తమకు సమాచారం అందిందని తెలిపారు. వెంటనే గ్రామానికి వెళ్లి మద్యం అమ్ముతుండగానే బాలీబాయిని అదుపులోకి తీసుకున్నామన్నారు. ఆమె వద్దనున్న 36 తెలంగాణా మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సతీష్ తెలిపారు.

ధరల భారం మోపిన కేంద్ర

పెదకూరపాడు, సెప్టెంబరు 18: ప్రజలపై మోయలేని ధరల భారాన్ని మోడీ ప్రభుత్వం మోపిందని సీపీఐ నియోజక వర్గ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు బుధవారం ఆరోపించారు. వంట నూనెలపై 20 నుంచి 32 శాతంకు పైగా దిగుమతి సుంకం విధించి ఆ భారాన్ని వినియోగదారులపై మోపిందన్నారు. దేశ చరిత్రలో పెద్ద మొత్తంలో దిగుమతి సుంకం విధించిన ప్రభుత్వంగా ఎన్డీయే ప్రభుత్వం కొత్త రికార్డు సృష్టించిందన్నారు. దీంతో చిరు వ్యాపారాలు చేసుకొనే వారి ఆదాయానికి గండి పడి ఉపాధి అవకాశం కోల్పోయే ప్రమాదం ఉందన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

క్రోసూరు, సెప్టెంబరు 18 : మండల కేంద్రం క్రోసూరులో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరిం చాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం సీపీఎం క్రోసూరు మండల మహాసభలో తీర్మానాన్ని నేతలు ఆమోదించారు. సభకు పార్టీ సీనియర్ నాయకురాలు ఎలిశమ్మ అధ్యక్షత వహించగా పార్టీ నేతలు గుంటూరు మల్లేశ్వరి, తిమ్మిశెట్టి హనుమంతరావు, అనూషా, చిలకా ఏసయ్య తదితరులు హాజరయ్యారు. అనంతరం సీపీఎం క్రోసూరు శాఖ కార్యదర్శిగా చిలకా ఏసయ్యను మహా సభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రెండు క్రస్ట్ గేట్ల ద్వారా

సాగర్ నీటి విడుదల

మాచర్ల రూరల్, సెప్టెంబరు 18: నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ 2 క్రస్ట్ గేట్ల ద్వారా బుధవారం అధికారులు నీటిని విడుదల చేశారు. 2 గేట్లను 8 అడుగుల మేర ఎత్తి దిగువకు 24,884 క్యూసెక్కులు విడుదల చేశారు. జలాశయం నీటిమట్టం 589.90 అడుగులు ఉంది. ఇది 311.74 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,000 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 4613, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,029, 2 క్రస్ట్ గేట్ల ద్వారా 24,884, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 ఎల్ఎల్‌సీ ద్వారా 600, మొత్తం అవుట్‌ఫ్లో 70,926 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు ఇన్‌ఫ్లోగా 70,926 క్యూసెక్కులు చేరుతోంది.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, పీడీ బాలునాయక్, ప్రిన్సిపాల్ నాతాని తదితరులు

యువతకు ఉపాధి కల్పించడం ప్రభుత్వ లక్ష్యం

● మెగా జాబ్ మేళాలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 18: చదువుకున్న యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళ్తుతుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. బుధవారం కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జెన్‌పాట్ కంపెనీ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రభుత్వం బాగా కృషి చేస్తుందన్నారు. జాబ్‌మేళాలో 280మంది పాల్గొన్నారు. వారికి జీడీ, ఇంటర్వ్యూ, ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించి ఎంపికచేయడం జరుగుతుందని, ఎంపిక అయిన వారికి మెయిల్ ద్వారా తెలియజేస్తామని డీఎస్‌డీవో కే సంజీవయ్య తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు, డైరెక్టర్ కే నాసరయ్య, కే వీరరాఘవులు, డీఆర్‌డీఏ పీడీ బాలునాయక్, ఏపీఎస్ఎస్‌డీసీ రామాంజనేయులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ దరఖాస్తుకు గడువు పెంపు

నరసరావుపేట కల్చరల్, సెప్టెంబర్, 18. నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు తేదీ ఈ నెల 24వరకు పొడిగించినట్లు పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ప్రభుత్వ పరీక్షల కార్యాలయ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, జిల్లా పరిషత్, మున్సిపల్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. కాగా సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రింటెడ్ నామినల్‌రోల్, ఎస్‌బీఐ కలెక్ట్ రశీదును జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఈ నెల 27 నాటికి సమర్పించవలసినదిగా కోరారు.

క్విజ్ పోటీల్లో శంకర భారతీపురం విద్యార్థులకు ద్వితీయ స్థానం

నరసరావుపేట లీగల్, సెప్టెంబరు 18: ఏపీ సాక్స్ ఆధ్వర్యంలో 2024 2020 సంవత్సరంలో హెచ్ఐవీపై విద్యార్థులకు అవగాహన కల్పించడంలోభాగంగా రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలను బుధవారం తాడేపల్లిలోని కేఎల్ యూనివర్సిటీలో నిర్వహించారు. ఈ క్విజ్ పోటీల్లో పట్టణంలోని శంకరభారతిపురం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని బి.శ్రావణి 9వ తరగతి విద్యార్థిని నాగశ్రీలు ద్వితీయస్థానం సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలను పాఠశాల సైన్స్ టీచర్ సూరిబాబు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి రవి కృష్ణ, డీఈవో వెంకటేశ్వర్లు జిల్లా సైన్స్ ఆఫీసర్ రాజశేఖర్ పాఠశాల సిబ్బంది విద్యార్థినీ, విద్యార్థులు అభినందించారు.

21 తెనాలిలో మాదిగ, ఉపకులాల ఆత్మీయ సమ్మేళనం

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 18: తెనాలిలో 21న ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై హర్షం వ్యక్తం చేస్తూ ఈ నెల 21న తెనాలిలో మాదిగ, ఉపకులాల ఆత్మీయ సమ్మేళనం సభ జరుగుతుందని ఎంఎస్‌పీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కనుమూరి కోటేశ్వరరావు అన్నారు. బుధవారం పట్టణంలోని రామిరెడ్డి పేటలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో హలో మాదిగ, చలో తెనాలి, మాదిగల ఆత్మీయ ఆత్మగౌరవ సమ్మేళనం పోస్టర్ల ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా కనుమూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ ఆత్మగౌర సమ్మేళనం సభ విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చిరుగూరి నాగరాజు, వనేష్, ప్రసాద్, శ్రీను, మహిళలు పాల్గొన్నారు.

నేటి నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు

నరసరావుపేట కల్చరల్, సెప్టెంబరు, 18: మండలంలోని ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నుంచి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలు, ఎంపికలు జరుగనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండ్రోజుల పాటు జరిగే ఈ పోటీలలో మండల పరిధిలోని వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొంటారన్నారు. అండర్-14, అండర్-17 విభాగాలలో బాలబాలికలకు ఖో-ఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్‌లలో పోటీలు నిర్వహించి, నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు ఆయన చెప్పారు

20న రొంపిచర్ల జడ్పీ పాఠశాలలో ఎంపికలు

రొంపిచర్ల, సెప్టెంబరు 18: మండల కేంద్రమైన రొంపిచర్ల జడ్పీ పాఠశాలలో అండర్ 14 విభాగంలో మండల స్థాయి స్కూల్ గేమ్స్‌కు క్రీడాకారుల ఎంపిక జరుగుతుందని ప్రధానోపాధ్యాయులు సుభానీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడు అంశాలల్లో ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్, చెస్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామన్నారు. మండలంలో ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల విద్యార్థులు పోటీలకు హాజరు కావాలని కోరారు.

నరసరావుపేటలో తూనికలు కొలతల శాఖ అధికారుల దాడులు

నరసరావుపేట లీగల్, సెప్టెంబరు 18: పట్టణంలో నిత్యావసరాలు అత్యధిక ధరలకు అమ్ముతున్నారని ఆరోపణల నేపథ్యంలో తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ బుధవారం పట్టణంలో తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని వివిధ ప్రధాన కూడళ్ళలో తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లఘించిన వారిపై నాలుగు కేసులు నమోదు చేసి, వారికి జరిమానా విధించినట్లు తెలిపారు.

నూజెండ్ల మండలంలో స్వచ్ఛతా హీ సేవ

నూజెండ్ల, సెప్టెంబరు 18: మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు నిర్వహించారు. కంఠంపాడులో జరిగిన కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ రవికుమార్, పంచాయతీ కార్యదర్శి బాలకోటేశ్వరరావు, స్వచ్ఛ భారత్ మండల రిసోర్స్‌పర్సన్ కె.సుబ్బరామయ్య, సచివాలయ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వర్గపోరుతో మూతపడిన వాటర్ ప్లాంట్

● ఆధిపత్యం కోసం కొనసాగుతున్న ప్లాంటుకు తాళం
● ఇబ్బందులు పడుతున్న చిరుమామిళ్ల గ్రామస్థులు



చిరుమామిళ్ళలో మూతపడిన వాటర్ ప్లాంట్

నాదెండ్ల, సెప్టెంబరు 18: మండలంలోని చిరుమామిళ్ళ గ్రామంలో టీడీపీ నాయకుల మధ్య వర్గపోరు ముదిరి గ్రామస్థుల కోసం దాతలు ఏర్పాటుచేసిన వాటర్‌ప్లాంట్ మూత పడేందుకు కారణమైంది హైదరాబాద్‌లోని గోల్కొండ గ్రూపు సంస్థల అధినేత తనకు జన్మనిచ్చిన చిరుమామిళ్ళ గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఈ క్రమంలో 12సంవత్సరాల క్రితం సుమారు రూ.7లక్షల వ్యయంతో గ్రామస్థులకు సురక్షిత నీరు అందించాలనే లక్ష్యంతో పంచాయతీ కార్యాలయ సమీపంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటుచేశారు. 20 లీటర్ల నీటిని రూ.5కే రామిరెడ్డి సేవా సమితి ద్వారా గ్రామస్థులకు తాగునీటిని అందించారు. 2019లో ఆ ప్లాంట్‌ను స్వాధీనం చేసుకున్న వైసీపీ నేతలు వైఎస్ఆర్ సేవా సమితి పేరుతో ఇటీవలి వరకు తాగునీటిని అందించారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామంలోని టీడీపీకి చెందిన ఒక వర్గం ఆ ప్లాంట్‌ను స్వాధీనం చేసుకొని నిర్వహిస్తూ ఉంది. కాగా నెల రోజుల క్రితం టీడీపీలోని మరో వర్గానికి చెందిన దళిత నేత తాము పార్టీవారమేనని, ప్లాంట్ మీరెలా నిర్వహిస్తారంటూ తాళం వేశారు. దీంతో గ్రామస్థులు తాగు నీటికోసం నానా ఇబ్బందులు పడుతున్నారు. తూబాడు, జంగాపల్లి గ్రామాల నుంచి తాగునీరు తెచ్చుకుంటున్నారు. తొలి నుంచీ గ్రామం కాంగ్రెస్, ఆ తరువాత వైసీపీకి గట్టి బలం ఉన్న గ్రామం. టీడీపీ ఆవిర్భావం తరువాత కొన్ని ఎన్నికల్లో గ్రామంలో టీడీపీ సానుభూతి పరులు ఓటింగ్ కూడా చేయలేని పరిస్థితి ఆ గ్రామంలో ఉంది. ఆ తరువాత టీడీపీకి గ్రామంలో ఒక వర్గం ఏర్పాటైంది. ఇలాంటి పరిస్థితి ఉన్న ఈ గ్రామంలో వర్గపోరు పార్టీ కార్యకర్తలను ఆందోళనకు గురిచేస్తున్నది.

ఉమ్మడి గుంటూరు జిల్లా బాల బాలికల పుట్‌బాల్ జట్ల ఎంపిక





పుట్‌బాల్ పోటీలకు ఎంపికైన బాలికల, బాలుర జట్ల క్రీడాకారులతో స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి ఎన్ సురేష్‌కుమార్ తదితరులు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 18: పట్టణంలోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియంలో పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో బుధవారం ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్-17 బాలబాలికల పుట్‌బాల్ జట్లు ఎంపిక జరిగింది. ఎస్‌జీఎఫ్ గుంటూరు జిల్లా అండర్-17 బాలికల విభాగంలో ఏ జాహ్నవీ రెడ్డి, జె శ్రీవల్లి, వీ దేవిక, వీ ప్రవల్లిక, పీ శరణ వల్లిక, ఎస్ గీతిక, టీ హనీ, టీ శ్రీలక్ష్మి, టీ నాగ సాయి మహేశ్వరి, ఎస్ శ్రావ్య, ఐ వసంతి, కే భావ్యశ్రీ, జీ నందినీ, ఎస్‌కే బాజీదబీ, పీ రమ్యశ్రీ, పీ శ్రీలేఖ, బీ మోక్షసాధన, ఎం భవిష్య, పీ శ్రీలక్ష్మి, జీ శ్రీవల్లి, బీ చంద్రిక, టీ స్వరూపరాణి ఎన్నికయ్యారు. బాలుర విభాగంలో పీ తేజ, పీ నవీన్‌కుమార్, ఎస్‌కే షోహేల్ తన్వీర్, ఎస్‌డీ ఆలీ, ఎస్‌కే నాగ నాజీర్, డీ సాయి కుమార్, ఇస్సాక్, ఆషిఫ్, జ్యోతి స్వరూప్, శివమణి, బీ రాఘవ, దీపక్, చరణ్‌కుమార్, బీ మహిధర్, బీ జశ్వంత్ నాయక్, వై పోతురాజు, డీ అంకమ్మరావు, వెంకటగిరి, పీ నాగరాజు, జీ సుభాష్, పీఎస్ఎస్ చరణ్ ఎంపిక అయ్యారు. ఈ నెలాఖరులో వినుకొండలో జరిగే రాష్ట్రసాయి 68వ స్కూల్ గేమ్స్ పోటీలలో ఎంపిక క్రీడాకారులు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎన్ సురేష్‌కుమార్ అన్నారు. ఎంపిక కార్యక్రమంలో గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎం రవి, వైవీ చిరంజీవిరావు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఐ సపోర్ట్ స్వచ్ఛ భారత్ సెల్ఫీ పాయింట్

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 18: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛ భారత్ కార్యక్రమానికి మద్దతు తెలుపుతూ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సెల్ఫీ పాయింట్‌ను బుధవారం జిల్లా కలెక్టర్ పి అరుణ్‌బాబు ప్రారంభించారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి ఆర్ వినాయకం, డీఆర్‌డీఏ పీడీ బాలునాయక్, ఆర్‌డబ్ల్యూఎస్‌హెచ్ ఆర్వో రమేష్, సెర్ప్ జిల్లా కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొని సెల్ఫీలు దిగారు.

2047 నాటికి అన్ని రంగాల్లో అగ్రగామిగా ఏపీ

● ఎమ్మెల్యే జీవీ



ఎన్డీఏ శాసనసభాపక్ష సమావేశంలో పాల్గొన్న వినుకొండ ఎమ్మెల్యే జీవీ తదితరులు

వినుకొండ, సెప్టెంబరు 18: రానున్న రోజుల్లో దేశంలోనే అన్ని రంగాల్లో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలిపేలా ప్రతిఒక్క ప్రజా ప్రతినిధి పనిచేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించినట్లు వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తెలిపారు. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో సీఎం అధ్యక్షతన జరిగిన ఎన్డీఏ శాసనసభాపక్ష సమావేశంలో జీవీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం 100 రోజుల పాలనపై చేపట్టిన కార్యక్రమాలు, ఈ నెల 20 నుంచీ 26 తేదీ వరకు ఎమ్మెల్యేలు ఇంటింటికీ వెళ్లేలా కార్యాచరణపై సమావేశంలో ప్రధానంగా చర్చించినట్లు తెలిపారు. స్వర్ణాంధ్రప్రదేశ్ పేరుతో 2047 విజన్ డాక్యుమెంట్ రూపొందించనున్నారని. అందో భాగంగా ఎమ్మెల్యేలు, ఎంపీలు కూడా నియోజకవర్గాల వారీగా విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారని అన్నారు. అలానే జల్ జీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా నీళ్లు ఇస్తామని, గ్రామాల్లో రోడ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.49కోట్లు ఖర్చు పెడుతుందన్నారు. కరువు పీడిత పల్నాడులో, ముఖ్యంగా వినుకొండలో ఉచిత తాగునీరు ఇవ్వాలన్న తమ సంకల్పం నెరవేరుతున్నందున ఆనందంగా ఉందని, ముఖ్యంత్రి ఆదేశాల మేరకు వినుకొండ అన్నిరంగాల్లో అభివృద్ధి చెందేలా విజన్ డాక్యుమెంట్ రూపొందించుకుంటామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేద్దాం

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 18: నరసరావుపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడవాలన్నదే లక్ష్యంగా అడుగులు వేస్తున్నానని పార్టీలకు అతీతంగా నరసరావుపేట అభివృద్ధికి కలసి పనిచేద్దాం అని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పిలుపునిచ్చారు. బుధవారం మండల పరిషత్ కార్యాయలంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ మోరబోయిన సుబ్బాయమ్మ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను అధికారులు పార్టీలకు అతీతంగా అర్హులైన పేదలందరికి అందించాలి తెలిపారు. అభివృద్ధి పనుల విషయంలోప్రజలకు మేలుచేసే విషయంలో రాజకీయాలు వద్దని హితవు పలికారు. ప్రతిపార్టీ నాయకుడిని కలుపుకుని ముందుకు వెళ్లి అభివృద్ధి సాధించుకుందామని పిలుపునిచ్చారు. నరసరావుపేట మండలంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలపై ఆయా శాఖల మండలస్థాయి అధికారులు నివేదికలను వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా గణేష్ నిమజ్జనోత్సవం

రొంపిచర్ల, సెప్టెంబరు 18: మండలంలోని విప్పర్ల గ్రామంలోని వల్లభేశ్వర స్వామి ఆలయంలో వినాయక చవితి పర్వదినం సందర్భంగా గణనాథుని విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా బుధవారం నిమజ్జనోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. మేళ తాళాల మధ్య గణనాథుని విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించారు. నకరికల్లు మండలం అడ్డరోడ్డు వద్ద గుంటూరు బ్రాంచ్ కెనాల్‌లో విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.



ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు సమక్షంలో ఈయూలో చేరిన వైసీపీ ఆర్టీసీ అసోసియేషన్ నాయకులు

కార్మికులకు పెండింగ్ బిల్లులను చెల్లించాలి

● ఆర్టీసీ ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు

వినుకొండ టౌన్, సెప్టెంబరు 18: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసినప్పటి నుంచి గత ప్రభుత్వంలోని పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని, ఆర్టీసీ ఉద్యోగుల భద్రత కోసం గతంలో (2019) టీడీపీ ప్రభుత్వం హయాంలో ఇచ్చిన సర్క్యులర్‌ను పునరుద్ధరించాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు, అమరావతి ఏపీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు కోరారు. పట్టణంలోని కారంపూడి రోడ్డులో ఎంప్లాయిస్ యూనియన్ డిపో కమిటీ అధ్యక్షుడు దాసరి విన్సెంట్ అధ్యక్షతన, కమిటీ సెక్రటరీ సాంబు ఆధ్వర్యంలో ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్ నైట్ అవుట్ అలవెన్సులు, గత ప్రభుత్వం రద్దుచేసిన ఉద్యోగ భద్రత బిల్లుపై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. వరద బాధితుల సహాయార్థం ఆర్టీసీ ఉద్యోగల వేతనంలో బేసిక్ పేని సీఎం సహాయనిధికి అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వినుకొండ ఆర్టీసీలోని వైఎస్ఆర్ ఆర్టీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్‌ను పూర్తిగా రద్దు చేసుకుని దామోదరరావు సమక్షంలో ఈయూలో కలిసిన 40మంది కార్మికులను అభినందించారు. ఈయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యం.కోటేశ్వరరావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.కోటేశ్వరరావు, పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే ఖాజా, జిల్లా కార్యదర్శి జీటీ రావు, జోనల్ కమిటీ సభ్యులు హరిబాబు, కేవీ అనూరాధ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థినికి సన్మానం

రొంపిచర్ల, సెప్టెంబరు 18: మండలంలోని రెడ్డిపాలెం మోడల్ పాఠశాలలో బైపీసీ చదివి నీట్ పరీక్షలో సత్తాచాటిన రుద్రపాటి శ్రీనిధిని బుధవారం ఘనంగా సన్మానించారు. ఒంగోలులోని గవర్నమెంట్ మెడికల్ కళాశాలలో ఆమె సీటు సాధించారు. ప్రిన్సిపాల్ రవినాయక్ మాట్లాడుతూ పట్టుదలతో, క్రమశిక్షణతో సాధారణస్థాయి నుంచి శ్రీనిధి ఉత్తమ ప్రతిభ కనబరిచారని తెలిపారు. ఆమె ఎంబీబీఎస్ సీటు సాధించటంపై తమ పాఠశాలకు ఎంతో గర్వంగా ఉందన్నారు. విద్యార్థిని శ్రీనిధి మాట్లాడుతూ తాను సీటు సాధించటానికి ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు ఎంతో పోత్సాహాన్ని అందించారని, ఈ పాఠశాలలో అంకితభావం గల ఉపాధ్యాయులు ఉన్నారన్నారని తెలిపింది. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు యాజమాన్య కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తెగిపడిన విద్యుత్ వైర్లు

వినుకొండటౌన్, సెప్టెంబరు 18: విద్యుత్ వైర్లు తెగి కింద పడిన సంఘటన పట్టణంలోని శృంగారపురం ఎస్సీకాలనీలో బుధవారం తెల్లవారుజామున జరిగింది. విద్యుత్ వైరు తెగిపడి ఉండటాన్ని గమనించి స్థానికులు తహసీల్దార్ సురేష్ దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఆయన విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే లైన్‌మెన్ అంజిరెడ్డి ప్రైవేట్ వ్యక్తుల సాయంతో విద్యుత్ సఫరా నిలిపివేసి, తెగిపడిన విద్యుత్ వైరును పునరుద్ధరించారు. గతంలో ఇదే స్తంభానికి ఉన్న విద్యుత్ వైర్లు తెగిపడ్డాయని, మరోసారి ప్రమాదాలు జరకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సమయ పాలన పాటించాలి: డీఎల్‌డీవో

ఈపూరు, సెప్టెంబరు 18: ఉద్యోగులు సమయపాలన పాటించాలని డీఎల్‌డీవో వెంకటరెడ్డి అన్నారు. మండలంలోని కొచ్చెర్ల సచివాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ కార్యాలయంలో సిటిజన్ చార్ట్ పెట్టాలన్నారు. పని చేయడంలో తాత్సారం చేయవద్దన్నారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి తిరుపతయ్య, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పరస్పర ఫిర్యాదులపై కేసు నమోదు

ఈపూరు, సెప్టెంబరు 18: పరస్పర ఫిర్యాదులపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం చేపల చెరువులో పురుగుమందు పోశాడంటూ యువకుడిపై దాడిచేసి గాయపరిచిన సంఘటన మండలంలోని చినకొండాయిపాలెంలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన గడిపూడి చినకోటయ్య (బుజ్జి) తాను సాగుచేస్తున్న చేపల చెరువులో గోరంట్ల సురేష్ చేపలు చనిపోయే మందును చల్లిపోతున్నాడని పోలీసులకు ఫిర్యాదుచేశాడు. అయితే సురేష్ పొలం పనికి వెళ్తున్న తనని చినకోటయ్య ఆయుధంతో దాడిచేసి గాయపరిచినట్లు సురేష్ పోలీసులకు పిర్యాదు చేశాడు. గాయపడిన సురేష్‌ను ఈపూరు ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం నర్సరావుపేట ఆసుపత్రికి వెళ్ళారు. పరస్పర పిర్యాదులపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి: డీఈవో



హెచ్ఎం, ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వర్లు

లింగారావుపాలెం (యడ్లపాడు), సెప్టెంబరు 18: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి ఉత్తమ ఫలితాలు సాధించాలని పల్నాడు జిల్లా డీఈవో ఎం వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని లింగారావుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డీఈవో బుధవారం సందర్శించారు. ముందుగా పాఠశాలలో కాంప్లెక్స్ సమావేశాలు జరుగుతున్న తీరును పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పాఠశాల ప్రగతిని సమీక్షించారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటరామిరెడ్డి, ఏఎస్‌వో పద్మారావు, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, ప్రభాకరశర్మ, టి.శైలజ, మేరిశౌరీలు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలసిన మాజీ మునిసిపల్ చైర్మన్ సుబ్బరాయ గుప్తా

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 18: నరసరావుపేట మాజీ మునిసిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయ గుప్తా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లాలో తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించారు. అనంతరం కలెక్టర్‌ను నాగసరపు సుబ్బరాయగుప్తా శాలువాతో సత్కరించి మెమొంటోను అందజేశారు.

పుట్టిన ప్రతి బిడ్డ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

● ఎస్‌సీపీఆర్‌సీ సభ్యురాలు బత్తుల పద్మావతి

వినుకొండటౌన్, సెప్టెంబరు 18: పౌష్టికాహారంతో పాటు, ఆరోగ్యకరమైన దేశ నిర్మాణంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఎస్‌సీపీఆర్‌సీ సభ్యురాలు బత్తుల పద్మావతి తెలిపారు. స్థానిక జాషువా కళా ప్రాంగణం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బుధవారం అంగన్‌వాడీ మాసోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న బత్తుల పద్మావతి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పోషణ అభియాన్ పోషణ మాసాన్ని నెల రోజులు పాటు పౌష్టికాహారంపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. పుట్టిన ప్రతి బిడ్డ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికారి ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.



పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎస్‌సీపీఆర్‌సీ సభ్యురాలు బత్తుల పద్మావతి

క్రీడలతో నాయకత్వ లక్షణాలు

తహసీల్దార్ హుస్సేన్



పోటీలను తిలకిస్తున్న తహసీల్దార్ హుస్సేన్, ఏఎంజీ డైరెక్టర్ అరుణ్ కుమార్ మహంతి

చిలకలూరిపేట, సెప్టెంబరు 18: క్రీడలు నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని చిలకలూరిపేట తహసీల్దార్ షేక్ మహమ్మద్ హుస్సేన్ బుధవారం అన్నారు. స్వచ్ఛంద సేవా సంస్థ ఏఎంజీ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అండర్ 14, 17 బాల బాలికల విభాగాలలో క్రీడాకారుల ఎంపిక కోసం జూడో పోటీలు బుధవారం జరిగాయి. ఈ సందర్భంగా పోటీలను ప్రారంభించిన తహసీల్దార్ హుస్సేన్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఏఎంజీ డైరెక్టర్ డాక్టర్ అరుణ్ కుమార్ కంటి మహంతి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కరీముల్లాలు ప్రసంగించారు. పోటీలలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు చెందిన 130మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి నూతక్కి రవి, ప్రిన్సిపాల్ కృపాదానం, షేక్ ఖాసిం బుడే, శివరామకృష్ణ, దుర్గ, పీడీ ఇమాన్యుల్ రాజ్, శ్రీనివాసరావు, సాయిరాం, సతీష్, ఎంవీ సుబ్బారావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ తీర్పును కేంద్రం వెనక్కు తీసుకోవాలి

● మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల

వినుకొండ, సెప్టెంబరు 18: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఓ వైపు క్రైస్తవులను, మరో వైపు ముస్లింలను అణిచివేస్తుందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్ కుమార్ ఆరోపించారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో బుధవారం ఏర్పాటైన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్గీకరణ పేరుతో ఎస్సీ, ఎస్టీలను విభజించే ఆలోచనను కేంద్ర ప్రభుత్వం మానుకోవాలన్నారు. లేనిపక్షంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో బీజేపీ అంతం.. మాలల పంతం అనే నినాదంతో ముందుకు వెళ్తామని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సుప్రీంకోర్టు తీర్పుపై పునరాలోచించి దానిని వెనక్కి తీసుకునేలా కేంద్రానికి లేఖలు పంపాలని, లేనిపక్షంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ధి చెబుతామని అన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్ పాల్ మాట్లాడుతూ బ్రిటీష్ వారి విభజించు పాలించు సిద్ధాంతాన్ని బీజేపీ అమలు చేస్తుందన్నారు. న్యాయమైన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించే వరకూ పోరాటాలకు సిద్ధంగా ఉండాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కీర్తిపాటి వెంకటేశ్వర్లు, గోదాబాల, జయరావు, సామ్యేల్, దార ఎర్రయ్య, కృపయ్య, విజయేందర్, దేవానంద్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

రొంపిచర్ల, సెప్టెంబరు 18: మండలంలోని రెడ్డిపాలెంలోని ఏపీ మోడల్ పాఠశాల, జడ్పీ పాఠశాలల్లో నరసరావుపేట మండలం ఉప్పలపాడుకు చెందిన నీడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం జరిగింది. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. చిన్న వయస్సులో వివాహాలు అనర్థమని తెలిపారు. 18సంవత్సరాలు నిండిన తరువాత వివాహాలు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రవినాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.